TGTEL/25/A3603

# కింగ్

డైలీ న్యూస్ పేపర్

King Daily News Paper

PUBLISHED FROM HYDERABAD AND VIJAYAWADA

హైదరాబాద్ సంపుటి: 01 సంచిక: 216 సోమవారం, జూన్ 22, 2026 పేజీలు :8 వెల.1/-

ఆరోగ్యవంతమైన మెడ్చల్ కోసం నమ్మకమైన వైద్య నిపుణులు
అత్యుత్తమమైన సేవలు,
ప్రతి అడుగులో మరింత శ్రద్ధ.
జైత్ర మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్
మా ప్రత్యేకతలు
• అత్యవసర & క్రిటికల్ కేర్
• ప్రమాద సేవలు
• ప్రసూతి & గైనకాలజీ
• ఆర్థోపెడిక్స్
• జాయింట్ రీప్లేస్‌మెంట్స్
• జనరల్ మెడిసిన్
• జనరల్ సర్జరీ
• మ్యాక్సిలో ఫేషియల్ సర్జరీ
• పిల్లల వైద్యం & శిశు సంరక్షణ
• న్యూరాలజీ • న్యూరోసర్జరీ
• ప్లాస్టిక్ సర్జరీ • పల్మనాలజీ
• యూరాలజీ • డెర్మటాలజీ
• సైకియాట్రీ • ఫిజియోథెరపీ




నమ్మకమైన వైద్యం | నైతిక వైద్య సేవలు | చికిత్సే ముందుగా | నిపుణుల క్లినికల్ సంరక్షణ
అన్ని ఇన్సూరెన్స్ క్యాష్‌లెస్ సౌకర్యం | 24/7 అత్యవసర సేవలు | అత్యాధునిక అంబులెన్స్
+91 85230 89599 +91 86889 09384
www.jaitrahospitals.com • ITI పక్కన, NH 44, చంద్ర నగర్, మెడ్చల్, తెలంగాణ - 501401.

# యోగా.. ఐక్యతకు మూలం: మోదీ



- వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా శాంతికి మంత్రం
- అభ్యాసం ఒక రోజుకు పరిమితం కాకూడదు
- అంతర్జాతీయ యోగా దినోత్సవంలో ప్రధాని ఉద్ఘాటన
- కోల్‌కతాలో ఆసనాలు వేసిన మోదీ

కోల్‌కతా: యోగా అనేది ప్రపంచ ఉద్యమమని, అది దేశాల.. సాంస్కృతిక సరిహద్దులను అధిగమిస్తుందని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. కేవలం ఒక్క రోజుకో, ఒక్క కార్యక్రమానికో పరిమితం చేయకుండా యోగాభ్యాసాన్ని దైనందిన జీవనంలో భాగంగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. జూన్ 21 అంటే సుదీర్ఘ పగలు ఉండే రోజుగానే కాకుండా అతి పెద్ద సామాజిక వేడుక దినంగా మారిందని, దానికి యోగా కారణమని పేర్కొన్నారు. 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కోల్‌కతాలోని రెడ్‌రోడ్‌లో జరిగిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కోల్‌కతాతోపాటు దేశంలోని అనేక ప్రాంతాల్లో, విదేశాల్లోని భారత రాయబార కార్యాలయాల ఆధ్వర్యంలో భారీగా వేడుకలు నిర్వహించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, కేంద్ర మంత్రులు, ఆయా రాష్ట్రాల గవర్నర్లు, ముఖ్యమంత్రులు, వివిధ వర్గాలవారు, దౌత్యవేత్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. కోల్‌కతా కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ- వ్యక్తిగత ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడానికే కాకుండా ప్రపంచ శాంతికి ఉత్ప్రేరకంగా యోగా నిలుస్తుందని చెప్పారు. 'ప్రాచీన భారతీయ అభ్యాసమైన యోగావల్ల శారీరక ఆరోగ్యానికి మించిన ప్రయోజనాలు అనేకం ఉన్నాయి. పనిని, పోషకాహారాన్ని, నిద్రను మనం సమతుల్యం చేసుకోవాలి. ఆధునిక జీవనశైలిలో దీనికి కొంత అవాంతరం వాటిల్లుతుంటుంది. ఏం చేయాలి.. ఏం చేయకూడదు.. జీవితాన్ని ఎలా సంతులనం చేసుకోవాలనేది యోగా మనకు చెబుతుంది. మన శరీరాన్ని ఎలా మలచుకోవాలో తెలిస్తే ఆరోగ్యం ఒక అలవాటుగా మారిపోతుంది. శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, ఆత్మ చైతన్యాలకు యోగా ఉపయోగపడుతుంది. ఏం చేయకూడదనే చైతన్యం మనలో వచ్చినప్పుడు ప్రపంచ శాంతికీ అది దారులు తెరుస్తుంది. అందుకే మన జీవన విధానానికే కాకుండా ప్రపంచ భవితవ్యం మెరుగయ్యేందుకూ ఇది అవసరం. అందుకే జీవితకాలమంతా దీనిని మనం, మన కుటుంబాలు, భవిష్యతరాలు అభ్యసించాలి. ప్రజల్ని దగ్గర చేయడానికి యోగా దారి చూపిస్తుంది. శారీరకంగానే కాకుండా అన్నివిధాలా, అన్ని వయసుల వారికీ ఇది ప్రయోజనం కలిగిస్తుంది. మానవాళి ఐక్యతను ప్రోది చేస్తుంది' అని ప్రధాని చెప్పారు. తెల్లని దుస్తుల్లో కార్యక్రమానికి హాజరైన మోదీ.. వేలమంది ప్రజలతో కలిసి యోగాసనాలు వేశారు. 40 నిమిషాలపాటు కొనసాగిన కార్యక్రమంలో ఆయన ప్రజల మధ్యకు వెళ్లి వారు యోగాభ్యాసం చేస్తున్న తీరును స్వయంగా గమనించారు. కొందరు సరైన భంగిమలో ఆసనాలు చేసేలా ఆయన సహకారం అందించారు.

కోల్‌కతాలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని మోదీ యోగాసనాలు

**తాజ్‌మహల్ నుంచి బీదర్ కోట వరకూ..**

యోగా దినోత్సవం సందర్భంగా ప్రపంచ ప్రఖ్యాత తాజ్‌మహల్ నుంచి బీదర్ కోట వరకూ దేశంలోని అనేక ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించారు. 'భారత పురావస్తు సర్వేక్షణ సంస్థ' (ఏఎస్‌ఐ) అధీనంలో ఉన్న అనేక ప్రాంతాలు వీటికి వేదికలయ్యాయి. 'వయసుతోపాటు ఆరోగ్యానికి యోగా' అనే ఇతివృత్తంతో ఈసారి కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యప్రదేశ్‌లోని జబల్పూర్‌లో రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, లద్దాఖ్‌లో ఉపరాష్ట్రపతి సి.పి.రాధాకృష్ణన్, షిల్లాంగ్‌లో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఆసనాలు వేశారు. సుప్రీం కోర్టు ప్రాంగణంలో భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ యోగాసనాలు వేశారు. దృష్టి కేంద్రీకరించి కొద్దిసేపు ధ్యానం చేసినా, చిన్నపాటి వ్యాయామాలు చేసినా ఎంతో ఫలితం ఉంటుందని ఆయన చెప్పారు.

పంజాబ్‌లోని అట్టారీ - వాఘా సరిహద్దు వద్ద బీఎస్‌ఎఫ్ సిబ్బంది యోగాసనాలు

**టోక్యో.. న్యూయార్క్..**

జపాన్ మొదలుకుని ప్రపంచంలో అనేక దేశాల్లో యోగా వేడుకలు ఉత్సాహంగా కొనసాగాయి. టోక్యోలో వర్షం కురుస్తున్నా లెక్క చేయకుండా యోగాసనాలు వేశారు. న్యూయార్క్‌లోని చరిత్రాత్మక టైమ్స్ స్క్వేర్‌వద్ద వేర్వేరు దేశాలకు చెందిన ఔత్సాహికులు చేరి యోగా చేశారు. రష్యా, చైనా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఫిన్లాండ్, మలేసియా, సౌదీ అరేబియా, కెనడా, ఒమన్, డెన్మార్క్, బంగ్లాదేశ్, నేపాల్ తదితర దేశాలన్నీ ఈసారి వేడుకల్లో పాల్గొన్నాయి. భారత దౌత్యవేత్తలు, రాయబార కార్యాలయాల సిబ్బందితోపాటు అనేకమంది ఔత్సాహికులు వీటిలో పాలుపంచుకున్నారు.

## జీరాంజీపై ఇతర రాష్ట్రాలతో కలిసి పోరాడతాం

### అవసరమైతే సుప్రీంకోర్టుకెళ్తాం: మంత్రివర్గ ఉపసంఘం



హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం జులై 1 నుంచి అమలు చేయనున్న జీరాంజీకి వ్యతిరేకంగా భాజపాయేతర పార్టీలు పాలించే రాష్ట్రాలతో కలిసి ఉమ్మడిగా పోరాడాలని రాష్ట్ర మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయించింది. అవసరమైతే అన్ని రాష్ట్రాలు కలిసి సుప్రీంకోర్టును ఆశ్రయించే అంశాన్ని కూడా పరిశీలించాలని అభిప్రాయపడింది. పథకంపై ప్రభుత్వానికి సమగ్ర సిఫార్సులు అందించేందుకు అంశాలవారీగా అధ్యయనం కొనసాగించాలని గ్రామీణ సంక్షేమం, ఉపాధి భద్రత, రాష్ట్రాల హక్కుల పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని తుది నివేదిక రూపొందించాలని తీర్మానించింది. ఆదివారం పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో మంత్రివర్గ ఉపసంఘ సమావేశం జరిగింది. పంచాయతీరాజ్, వ్యవసాయ, కార్మికశాఖల మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, వివేక్‌లు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. పంచాయతీరాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిశోర్, కమిషనర్ దివ్యా దేవరాజన్, ప్రత్యేక కమిషనర్ లక్ష్మి, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్త చట్టం వల్ల గ్రామీణుల ఉపాధి, స్థానిక సంస్థలు, వ్యవసాయ రంగంపై కలిగే ప్రభావాలపై చర్చించారు. క్షేత్రస్థాయి పరిస్థితులు, గ్రామీణ ప్రాంత ప్రజల అవసరాలు, కూలీల జీవనోపాధిపై చట్టం ప్రభావం వంటి అంశాల గురించి అధికారులు వివరించారు. కొత్త చట్టంలో ప్రతిపాదించిన 60 రోజుల ఉపాధి విరామం అమలు సాధ్యం కాదని మంత్రులు అన్నారు. దీనివల్ల కూలీలకు ఉపాధి అవకాశాలు తగ్గిపోవడంతో పాటు కూలి రేట్లపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సమాఖ్య స్ఫూర్తికి విరుద్ధంగా రాష్ట్రాలను సంప్రదించకుండా కేంద్ర ప్రభుత్వం 40% నిధుల భారాన్ని మోపడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాలతో పాటు భాజపాయేతర పార్టీల పాలనలో ఉన్న రాష్ట్రాలతోనూ సంప్రదింపులు జరపాలని సమావేశం నిర్ణయించింది. మరో రెండు మూడు రోజుల్లో సబ్ కమిటీ మరోసారి సమావేశమై తదుపరి కార్యాచరణపై చర్చించాలని నిర్ణయం తీసుకుంది.

**కేంద్రం కుట్రలను అడ్డుకుంటాం**

సమావేశం అనంతరం ఉత్తమ్ మాట్లాడుతూ "ఉపాధి హామీ చట్టం ద్వారా గ్రామీణ పేదలకు కల్పించిన హక్కులను క్రమంగా నిర్వీర్యం చేసి, రాష్ట్రాల అధికారాలను హరించేందుకు కేంద్రం కుట్రపూరితంగా ఈ కొత్త చట్టాన్ని తీసుకొస్తోంది. దీనిని అడ్డుకుంటాం. ఉపాధి హామీ పథకానికి మహాత్మా గాంధీ పేరు తొలగించడం దేశ చరిత్రను అవమానించడమే. రాంజీ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలి" అని ఆయన డిమాండ్ చేశారు.

## ప్ర రా బి నేటిమాట..

ప్రాపంచిక సుఖాలను ఇష్టపడితే మనసు చెడు సంస్కారాల వైపు మళ్లుతుంది. వ్యక్తులు రుగ్మతల బారినపడి ఇబ్బందుల పాలవడానికి మూలకారణం ఇంద్రియాలను కట్టడి చేయకుండా విచ్చలవిడిగా జీవించడమే. వయసు మళ్లిన తరవాత మనల్ని మనం సంస్కరించుకోలేకపోయామే అని పశ్చాత్తాపపడితే ప్రయోజనం శూన్యం.

చెడు సంస్కారాలు అబ్బడం చాలా సులభం. కానీ వాటిని దూరం చేసుకోవడమే కష్టం. వైద్య చికిత్సలు శారీరక రుగ్మతలను నయం చేస్తాయి కానీ జలగల్లా మనిషి స్వభావాన్ని పట్టి బాధిస్తున్న లోపాలను తగ్గించలేవు. ఆధ్యాత్మిక సాధనతోనే అవి సమసిపోతాయి. మంచి, మర్యాద, వినయ విధేయతలు పాటించే వ్యక్తులే సమాజంలో గౌరవం పొందుతారు. అవేవీ లేనివారిపై సంస్కార హీనులన్న ముద్ర పడుతుంది.

- ప్రమీల రాణి బి

## నౌకాయాన సామర్థ్యమే రక్షాకవచం

### 3 నౌకల్ని ప్రారంభించిన ప్రధాని




కోల్‌కతా: నౌకాయానపరంగా బలమైన సామర్థ్యంతో ఉండటం.. ఏ దేశ ఆర్థిక, వ్యూహాత్మక ప్రభావాన్నైనా నిర్ణయించడంలో కీలకమని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దీనిని మన దేశం అర్థం చేసుకుని తదనుగుణంగా సన్నద్ధమవుతోందని చెప్పారు. భారత నౌకాదళాన్ని మరింత బలోపేతం చేసేందుకు దేశీయంగా నిర్మించిన ఐఎన్‌ఎస్ దునాగిరీ, ఐఎన్‌ఎస్ అగ్రయ్, సర్వే నౌక ఐఎన్‌ఎస్ సంశోధక్‌లను ఆదివారం ఆయన జాతికి అంకితం చేశారు. శత్రువుల ఎత్తుగడలను చిత్తు చేసేలా అత్యాధునిక దేశీయ పరిజ్ఞానంతో తయారు చేసిన వీటిని కోల్‌కతాలోని శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఓడరేవులో ప్రధాని ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. రక్షణ రంగంలో స్వావలంబన కోసం మన దేశం చేస్తున్న కృషికి ఈ నౌకలు నిదర్శనమని పేర్కొన్నారు.

**సైనికావసరాలు ప్రపంచానికి మార్కెట్ కారాదు**

'భారతీయ పరిశ్రమల ప్రతిభ, ఇంజినీర్ల నైపుణ్యం, కార్మికుల కఠోర శ్రమవల్లే నూతన నౌకల నిర్మాణం సాధ్యమైంది. రక్షణపరమైన కొనుగోళ్లు చేసే దేశంగానే మిగిలిపోవాలని మనం కోరుకోవడం లేదు. మన సైనిక దళాలు ప్రపంచానికి కేవలం మార్కెట్‌గా మారకూడదు. స్వయం సమృద్ధిద్వారా మన సామర్థ్యానికి గుర్తింపు లభిస్తుందే తప్ప ఇలాంటి మార్కెట్‌వల్ల కాదు. నౌకాయానంపై ఆధిపత్యం లేకుండా ఏ దేశమైనా పెద్ద శక్తిగా ఎదగజాలదు. అభివృద్ధి, రక్షణ, సుసంపన్నత అనేవి సముద్రాలతో ముడిపడి ఉంటాయి' అని ప్రధాని చెప్పారు. లక్షల ఉద్యోగాలు సృష్టించగల సత్తా నౌకాయాన రంగానికి ఉందన్నారు. నౌకాయాన శక్తిలో తదుపరి దశలో ప్రవేశించే సమయం ఆసన్నం కావడంతో నౌకా నిర్మాణ పరిశ్రమలో నూతన దార్శనికత దిశగా పయనిస్తున్నామని చెప్పారు. ఓడరేవుల ఆధారిత ఆర్థిక వృద్ధికి సాగరమాల ప్రాజెక్టు ఉపకరిస్తుందని చెప్పారు.

## మోదీ పాలనలో అగ్ర రాజ్యాల సరసన భారత్

### కేంద్ర మంత్రి బండి సంజయ్





తెలంగాణచౌక్ : అవినీతికి తావులేకుండా సుస్థిర పాలనతో భారత్‌ను అగ్ర రాజ్యాల సరసన చేర్చి దేశగతిని మార్చిన మహనీయుడు ప్రధాని నరేంద్ర మోదీ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. ప్రధాని మోదీ 12 ఏళ్ల పాలనను పురస్కరించుకొని ఆదివారం కరీంనగర్‌లో నిర్వహించిన మేధావుల సదస్సుకు బండి సంజయ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మోదీ ప్రభుత్వం దేశంలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తీసుకొచ్చిందని.. 81 కోట్ల మందికి ఉచిత ఆహారభద్రత కల్పించిందని వివరించారు. 15 కోట్ల ఇళ్లలో శౌచాలయాల నిర్మాణం జరిగిందన్నారు. 11 కోట్ల ఉజ్వల కనెక్షన్లు అందజేయగా.. 4 కోట్ల ఇళ్ల నిర్మాణం పూర్తయిందని, మరో 3 కోట్ల గృహాల నిర్మాణ పనులు జరుగుతున్నాయని తెలిపారు. 59 కోట్ల జన్‌ధన్ ఖాతాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపాయన్నారు. భాజపా హయాంలో సంక్షేమ పథకాల డబ్బు నేరుగా లబ్ధిదారుల ఖాతాలో జమ అవుతుందన్నారు. వడ్ల కొనుగోలుపై రాష్ట్ర ప్రభుత్వం మోదీ సర్కారుపై దుష్ప్రచారం చేస్తోందని.. వాస్తవానికి ప్రతి గింజను కేంద్రమే కొంటుందని పేర్కొన్నారు. అక్రమ చొరబాటుదారుల ఓట్లను, దొంగ ఓట్లను తొలగించాల్సిందేనని.. నిజమైన పౌరుల ఓట్లను తొలగించే అవకాశమే లేదని స్పష్టం చేశారు. అంతకుముందు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కరీంనగర్‌లో నిర్వహించిన వేడుకల్లో మంత్రి పాల్గొన్నారు.

కరీంనగర్‌లో సంజయ్..

ప్రపంచానికి భారత్ అందించిన అమూల్య జీవన విధానం యోగా: ఎన్.రామచందర్‌రావు

రాంనగర్, న్యూస్‌టుడే: యోగా.. భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన జీవన విధానమని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచందర్‌రావు పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం హైదరాబాద్ ఇందిరాపార్క్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీలు కె.లక్ష్మణ్, ఆర్.కృష్ణయ్య, మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయతో కలిసి రామచందర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా యోగా శిక్షకురాలు డాక్టర్ సుభద్ర భూపతిరాజును నిర్వాహకులు సత్కరించారు.

# సంపాదకీయం

**సోమవారం, జూన్ 22, 2026**

## అపహాస్యమవుతున్న హాస్యం

ప్రస్తుత డిజిటల్ యుగంలో స్టాండప్ కామెడీ సంస్కృతి యువతను విపరీతంగా ఆకట్టుకుంటోంది. అయితే, ఈ మధ్యకాలంలో హాస్యం పండించడం కంటే వివాదాలు సృష్టించడమే దీని ప్రధాన లక్షణంగా మారిందా అనే అనుమానాలు బలపడుతున్నాయి. కామెడీ క్లబ్‌లలో లేదా సోషల్ మీడియా రీల్స్‌లో వ్యక్తమవుతున్న కొన్ని అభిప్రాయాలు, జోకులు నవ్వు తెప్పించకపోగా, వినేవారికి తీవ్ర అసహ్యం కలిగిస్తున్నాయి. హాస్యానికి , ఎగతాళికి, అవమానపర్చడానికి , అసభ్యతకు మధ్య ఉన్న లక్ష్మణ రేఖను కొందరు పూర్తిగా విస్మరిస్తుండటంతో ఈ సరిహద్దుల వివాదం ఇప్పుడు పోలీస్ స్టేషన్లు, కోర్టుల వరకు వెళ్తోంది.ఇలాంటి వివాదాల్లో చిక్కుకుంటున్న వారిలో ఎక్కువ మంది ప్రొఫెషనల్ కామిక్స్ కాకపోవడం గమనార్హం. ఐటీ రంగానికి చెందిన టెకీలు, వైద్య వృత్తిలో ఉన్న డాక్టర్లు, ఇతర రంగాల వారు కేవలం పార్ట్–టైమ్ క్రేజ్ కోసం మైక్ పట్టుకుని స్టేజ్ ఎక్కుతున్నారు. గతంలో ఒక ప్రదర్శనలో ఐదేళ్ల చిన్నారిపై అత్యంత అసహ్యకరమైన, లైంగిక కోణంలో జోకులు వేసిన ఉదంతం దేశవ్యాప్తంగా తీవ్ర ఆగ్రహాన్ని రేకెత్తించింది. ఇటీవల ముంబై, గురుగ్రామ్‌లలో జరిగిన 370 రూపాయల బిర్యానీ వివాదం కూడా తీవ్ర చర్చకు దారితీసింది. మహిళల ఆత్మగౌరవాన్ని, సమ్మతిని కించపరిచేలా ప్రేక్షకులు మాట్లాడిన మాటలను సదరు కమెడియన్ అడ్డుకోకుండా ప్రోత్సహించడంపై జాతీయ మహిళా కమిషన్ తీవ్రంగా స్పందించింది. దీనివల్ల సదరు వ్యక్తులు తమ చేతులా కెరీర్లను పాడుచేసుకోవడమే కాకుండా, ఉద్యోగాలు కోల్పోయి చట్టపరమైన ఇబ్బందులు కొనితెచ్చుకుంటున్నారు.రాజకీయ విమర్శల పేరుతో నేతల వ్యక్తిగత, కుటుంబ జీవితాలను కించపరిచేలా మాట్లాడటం స్టాండప్ కామెడీ కాదు.. అది ముమ్మాటికీ వ్యక్తిత్వ హననమే. రాజకీయ నాయకులను టార్గెట్ చేస్తూ కామెడీ చేయడం ఈ రంగంలో ఒక సాధారణ అంశమే అయినప్పటికీ, ఇటీవల ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడులపై కొందరు కమెడియన్లు చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. హైదరాబాద్‌కు చెందిన కమెడియన్ అనుదీప్ కాటికాల పవన్ కల్యాణ్ వ్యక్తిగత జీవితాన్ని, కుటుంబ వ్యవహారాలను ఎగతాళి చేస్తూ చేసిన వ్యాఖ్యలపై జనసేన శ్రేణులు తీవ్రంగా మండిపడ్డాయి. ఫలితంగా ఏపీ పోలీసులు ఉత్తరప్రదేశ్‌కు వెళ్లి మరీ అతడిని అరెస్ట్ చేయాల్సి వచ్చింది. అలాగే మరో కమెడియన్ శరత్ ఉదయ్ గతంలో చంద్రబాబు నాయుడు, నారా లోకేశ్‌లను ఉద్దేశించి చేసిన పాత జోకులపై బెంగళూరులో జరుగుతున్న లైవ్ షోలో కొందరు అభిమానులు గొడవకు దిగి, బలవంతంగా క్షమాపణలు చెప్పించడం కూడా పెద్ద సంచలనంగా మారింది.రాజకీయ విమర్శలు, వ్యంగ్యం అనేది ప్రజాస్వామ్యంలో సహజం. అమెరికా, యూరప్ దేశాల్లో అధ్యక్షులపైనే తీవ్రమైన జోకులు వేస్తుంటారు. కానీ, అక్కడ ఆ వ్యంగ్యం వారి విధానాలు, నిర్ణయాలపై ఉంటుంది తప్ప వారి వ్యక్తిగత జీవితాల మీద, భార్యాపిల్లల మీద ఉండదు. మన దగ్గర జరుగుతున్న పొరపాటు ఇదే. పవన్ కల్యాణ్ గత వైవాహిక జీవితాన్ని ప్రస్తావించడం, లేదా చంద్రబాబు నాయుడిపై జరిగిన పాత హత్యాయత్న ఉదంతాలను హాస్యాస్పదం చేయడం ఏమాత్రం ప్రొఫెషనలిజం అనిపించుకోదు. కామెడీ పేరుతో సినీ సెలెబ్రిటీల వ్యక్తిగత జీవితాలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తెలుగు స్టాండప్ కమెడియన్ అనుదీప్ కటికాల అరెస్ట్ అయ్యారు. కాకినాడ పోలీసులు ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో అతడిని అదుపులోకి తీసుకున్నారు. అనుదీప్ సినిమా సెలెబ్రిటీలను కించపరుస్తూ కామెడీ చేశారు. ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, నిహారిక, రామ్ చరణ్‌లపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.ఆ వీడియోలను చూసిన మెగా అభిమానులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. షో జరుగుతున్న చోటుకు వెళ్లారు. అయితే, ఈ విషయం తెలుసుకున్న అనుదీప్ అక్కడినుంచి పరారయ్యాడు. రెండు రోజుల తర్వాత మెగా కుటుంబానికి క్షమాపణ చెబుతూ వీడియో రిలీజ్ చేశాడు. అయినా లాభం లేకుండా పోయింది. ఈ నేపథ్యంలోనే జనసేన పార్టీ ఈస్ట్ గోదావరి జాయింట్ సెక్రటరీ బడే వెంకట కృష్ణ.. కాకినాడ పోలీస్ స్టేషన్‌లో అనుదీప్‌పై ఫిర్యాదు చేశారు. పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకున్న కాకినాడ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.నవ్వులు పూయించాల్సిన వేదికలు కాస్తా, రాజకీయ కక్షలకు, వ్యక్తిగత దూషణలకు సాధనాలుగా మారుతుండటంతోనే సమాజం నుంచి తీవ్ర వ్యతిరేకత వస్తోందిఈ పరిణామాలన్నీ స్టాండప్ కామెడీ రంగంలో సెల్ఫ్ సెన్సార్‌షిప్ ఎంత అవసరమో గుర్తుచేస్తున్నాయి. కేవలం కొన్ని వ్యూస్ కోసం, చప్పట్ల కోసం , వైరల్ అవ్వాలనే తాపత్రయంతో సమాజం అంగీకరించని హద్దులను దాటడం వల్ల కెరీర్‌లు ముగిసిపోతాయి తప్ప గుర్తింపు రాదు. చట్టం తన పని తాను చేసుకుపోతున్న తరుణంలో.. హాస్యం అంటే ఎదుటివారిని నొప్పించడం కాదు, మెప్పించడం అనే కనీస ధర్మాన్ని కమెడియన్లు తెలుసుకోకపోతే ఈ వేదికల ఉనికికే ప్రమాదం ఏర్పడే అవకాశం ఉంది.

**- ఎడిటర్**

## ‘ఎర్త్‌కాన్ 2026’లో టాటా హిటాచీ సరికొత్త యంత్రాల ప్రదర్శన

హైదరాబాద్ , జూన్ 20, 2026: భారతదేశంలో ప్రముఖ నిర్మాణ పరికరాల తయారీ సంస్థ టాటా హిటాచీ నగరంలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ప్రారంభమైన ‘ఎర్త్‌కాన్ 2026’లో ‘రిలయబుల్ ఆరెంజ్’ థీమ్ కింద దేశీయ మౌలిక సదుపాయాలు, నిర్మాణ రంగానికి ఉపయోగపడే నాలుగు అధునాతన యంత్రాలను (షిన్‌రాయ్ ప్రైమ్, జాక్సిస్ 38యూ, టీఎల్ 340హెచ్ ప్రైమ్, ఈఎక్స్ 210ఎల్సీ ప్రైమ్) ప్రదర్శనకు ఉంచింది. ఈ ప్రదర్శన ఈనెల 21వ తేదీ వరకు ఉంటుంది. నమ్మకమైన, అధిక సామర్థ్యం గల నిర్మాణ పరిష్కారాలను అందించాలన్న ఉద్దేశంతో కాంట్రాక్టర్లు, మౌలిక సదుపాయాల డెవలపర్లు, పరికరాలను అద్దెకు ఇచ్చే వారు, ఇతర వినియోగదారుల మారుతున్న అవసరాలను తీర్చేలా ప్రత్యేకంగా రూపొందించిన యంత్రాలను టాటా హిటాచీ ఇక్కడ ప్రదర్శిస్తోంది. హాల్ నెం1, స్టాల్ బీని సందర్శించే వారికి టాటా హిటాచీకి చెందిన నాలుగు అధునాతన యంత్రాలను ప్రత్యక్షంగా చూసే అవకాశం ఉంది.




ఈ సందర్భంగా టాటా హిటాచీ మార్కెటింగ్ జనరల్ మేనేజర్ సిద్ధార్థ్ చతుర్వేది మాట్లాడుతూ భారతదేశ మౌలిక సదుపాయాల మార్పుకు కారణమవుతున్న వినియోగదారులు, భాగస్వాములు, పరిశ్రమలోని ఇతర వాటాదారులతో అనుసంధానం కావడానికి ఎర్త్‌కాన్ ఒక అద్భుతమైన వేదికను అందిస్తుందన్నారు. టాటా హిటాచీలో మా దృష్టి ఎప్పుడూ వినియోగదారులు నమ్మగలిగే యంత్రాలను అందించడంపైనే ఉంటుందన్నారు. అత్యుత్తమ పని తీరు, ఇంధన సామర్థ్యం, దీర్ఘకాలిక మన్నిక కోసం నిర్మించబడిన ఉత్పత్తులు ఇవన్నారు. మా ‘రిలయబుల్ ఆరెంజ్’ పోర్ట్‌ఫోలియో దశాబ్దాల ఇంజనీరింగ్ నైపుణ్యానికి, వినియోగదారుల నమ్మకానికి ప్రతీక అన్నారు. ఎర్త్‌కాన్ 2026 లో మా భాగస్వామ్యం ద్వారా కాంట్రాక్టర్లు, పరికరాల యజమానులు దేశ మౌలిక సదుపాయాలను పూర్తి నమ్మకంతో నిర్మించడానికి మా పరిష్కారాలు ఎలా తోడ్పడుతున్నాయో ప్రదర్శించడానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నామన్నారు. షిన్‌రాయ్ ప్రైమ్ విత్ రాక్ బ్రేకర్ అటాచ్‌మెంట్ : క్వారీయింగ్, రహదారుల నిర్మాణం, ట్రెంచింగ్, కూల్చివేతలు తదితర పనుల కోసం తయారు చేయబడిన బహుముఖ యంత్రం ఇది. శక్తివంతమైన పని తీరు, ఇంధన సామర్థ్యం, విశ్వసనీయతను అందిస్తుంది. జాక్సిస్ 38యూ : ఇరుకైన ప్రదేశాలు, పట్టణ మౌలిక సదుపాయాలు, ల్యాండ్‌స్కేపింగ్, యుటిలిటీ ప్రాజెక్టులలో అత్యుత్తమ పని తీరును కనబరచడానికి రూపొందించిన ఒక కాంపాక్ట్ మినీ ఎక్స్‌కవేటర్. టీఎల్ 340హెచ్ ప్రైమ్ : హైడ్రోస్టాటిక్ ట్రాన్స్‌మిషన్‌తో కూడిన ఈ విభాగంలో భారతదేశంలో తయారైన ఏకైక వీల్ లోడర్. ఇది మెరుగైన ఇంధన సామర్థ్యం, ఆపరేటర్ సౌకర్యం, తక్కువ నిర్వహణ ఖర్చులు కలిగి ఉంటుంది. ఈఎక్స్ 210ఎల్సీ ప్రైమ్ విత్ రాక్ బ్రేకర్ అటాచ్‌మెంట్ : కఠినమైన రాక్–బ్రేకింగ్, క్వారీయింగ్, మౌలిక సదుపాయాల కల్పన వంటి ఎన్నో రకాల పనుల కోసం రూపొందించిన టాటా 20–టన్ క్లాస్ ఎక్స్‌కవేటర్. బలమైన హైడ్రాలిక్ పని తీరు, మన్నికైన నిర్మాణం, సులభమైన నిర్వహణను కలిగి ఉన్న ఈ యంత్రం అత్యంత కఠినమైన పని పరిస్థితుల్లోనూ గరిష్ట ఉత్పాదకతను అందిస్తుంది. మరిన్ని వివరాల కోసం.. [illegible] సందర్శించండి.

## రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామంలోని సర్వే నంబర్ 41/9లో ఉన్న మాజీ సైనికుడి కుమార్తె భూపోరాటం: నకిలీ జీపీఏలతో కోట్ల విలువైన భూమిని కాజేసే కుట్రపై న్యాయం కోరుతున్న మైమూనా బేగం

రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం ఖానామెట్ గ్రామంలోని సర్వే నంబర్ 41/9లో ఉన్న ఐదు ఎకరాల విలువైన భూమికి సంబంధించి భారీ భూ అక్రమాల వ్యవహారం వెలుగులోకి వచ్చింది. మాజీ సైనికుడు దివంగత షేక్ అహ్మద్‌కు ప్రభుత్వం కేటాయించిన ఈ భూమిని నకిలీ పత్రాలు, అక్రమ లావాదేవీలు, సృష్టించబడిన జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జిపిఏ)ల ఆధారంగా కొందరు వ్యక్తులు స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఏకైక వారసురాలు మైమూనా బేగం ఆరోపించారు.ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, తన తండ్రి షేక్ అహ్మద్‌కు మాజీ సైనికుల కోటాలో ప్రభుత్వం జీఓ ఎంఎస్ నంబర్ 743 (1963), జీఓ ఎంఎస్ నంబర్ 681 (1964) ప్రకారం ఖానామెట్ గ్రామంలోని 5 ఎకరాల భూమిని కేటాయించిందని తెలిపారు. అనంతరం 19 జూలై 1994న ఫైనల్ పట్టా నంబర్ 727/1994 జారీ చేయబడిందన్నారు.ఈ భూమికి సంబంధించిన ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారసత్వ హక్కులు మాత్రమే వర్తిస్తాయని, విక్రయం లేదా బదిలీ చేయడానికి అవకాశం లేదని ఆమె స్పష్టం చేశారు. అయితే, తమ తండ్రి జీవించి ఉన్న సమయంలోనే 18 జూలై 1992 తేదీతో నకిలీ జీపీఏ సృష్టించి, ఆ పత్రం ఆధారంగా భూమిని అక్రమంగా ఇతరుల పేర్లకు బదిలీ చేసినట్లు దర్యాప్తులో బయటపడిందని తెలిపారు.నకిలీ పత్రాల్లో అనేక అక్రమాలుసదరు జీపీఏలో అసలు యజమాని తండ్రి పేరు షేక్ ఓస్మాన్‌కు




బదులుగా షేక్ యూసుఫ్‌గా పేర్కొనడం, అసలు భూమి సర్వే నంబర్ 41/9కు బదులుగా కేవలం 41గా నమోదు చేయడం, అలాగే 1994లో పట్టా పొందిన భూమికి 1992లోనే జీపీఏ ఎలా సృష్టించబడిందనే ప్రశ్నలు ఈ వ్యవహారంలో భారీ మోసాన్ని సూచిస్తున్నాయని ఆమె పేర్కొన్నారు.
ఈ నకిలీ జీపీఏ ఆధారంగా అటార్నీ హోల్డర్ కె. కృష్ణ తన భార్య జగదాంబ పేరుపై భూమిని రిజిస్ట్రేషన్ చేసుకుని, అనంతరం ముక్కలు చేసి పలువురికి విక్రయించారని ఆరోపించారు. ప్రస్తుతం డి. సురేష్ బాబు మరియు వారి కుటుంబ సభ్యులు ఆ భూమిపై హక్కులు కలిగి ఉన్నట్లు చూపించుకుంటున్నారని తెలిపారు.

**కోర్టులో కొనసాగుతున్న న్యాయపోరాటం**

ఈ అక్రమ లావాదేవీలను సవాలు చేస్తూ మైమూనా బేగం 2015లో సివిల్ సూట్ దాఖలు చేశారు. ప్రస్తుతం ఈ కేసు కూకట్‌పల్లిలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఓఎస్. నెంబర్. 1256/2021గా విచారణలో ఉంది. గతంలో కోర్టు యథాతథ స్థితిని కొనసాగించాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ, ప్రస్తుతం క్రాస్ ఎగ్జామినేషన్ దశలో ఉన్న కేసుపై హైకోర్టులో సి ఆర్ పి నంబర్. 4096/2024 ద్వారా స్టే పొందినట్లు ఆమె తెలిపారు.అదే సమయంలో రెవెన్యూ అధికారుల ఎదుట కూడా అప్పీలు దాఖలు చేయగా, సివిల్ కోర్టు తుది తీర్పు వచ్చే వరకు ఎటువంటి చర్యలు చేపట్టవద్దని ఆర్‌డీఓ స్పష్టమైన అభిప్రాయం వ్యక్తం చేసినట్లు పేర్కొన్నారు.భూమిపై అక్రమ చొరబాట్లపై అధికారులకు ఫిర్యాదుకేసు కోర్టు పరిధిలో ఉండగానే కొందరు ప్రభావశీల వ్యక్తులు మరియు రియల్ ఎస్టేట్ సంస్థల సహకారంతో భూమిని స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ సైబరాబాద్ పోలీస్ కమిషనర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ మరియు శేరిలింగంపల్లి తహసీల్దార్‌కు ఆమె అధికారిక ఫిర్యాదులు సమర్పించారు.భూమి వద్ద నిర్మాణ కార్యకలాపాలు కొనసాగుతున్నాయని, వాటిని ప్రశ్నించినప్పుడు సంబంధిత సిబ్బంది దురుసుగా ప్రవర్తించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

**క్యాన్సర్‌తో పోరాడుతున్న మహిళకు ఇదే జీవనాధారం**

గత ఆరేళ్లుగా క్యాన్సర్ వ్యాధితో పోరాడుతూ చికిత్స పొందుతున్న మైమూనా బేగం, తన భర్త రోజువారీ కూలీ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారని తెలిపారు. నలుగురు పిల్లల భవిష్యత్తుకు ఈ భూమి మాత్రమే ఆధారమని, కోట్ల విలువైన తమ వారసత్వ ఆస్తిని కాపాడుకోవడానికి న్యాయపోరాటం చేస్తున్నానని కన్నీటి పర్యంతమయ్యారు.

**ప్రభుత్వం, పోలీసు అధికారులు తక్షణమే జోక్యం చేసుకోవాలి**

ఈ సందర్భంగా ఆమె ప్రభుత్వాన్ని, పోలీసు అధికారులను కోరుతూఖానామెట్ భూమిపై జరుగుతున్న అక్రమ చొరబాట్లు, నిర్మాణాలపై సమగ్ర విచారణ చేపట్టాలి.కోర్టు తుది తీర్పు వెలువడే వరకు భూమిపై ఎటువంటి మార్పులు జరగకుండా చర్యలు తీసుకోవాలి.తనకు మరియు తన కుటుంబ సభ్యులకు ప్రాణ, ఆస్తి రక్షణ కల్పించాలి.నకిలీ పత్రాలు సృష్టించి ప్రభుత్వ భూమిని అక్రమంగా విక్రయించిన వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. న్యాయస్థాన ఆదేశాలను ఉల్లంఘిస్తూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తున్న వారిపై వెంటనే చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.మాజీ సైనికుడి కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం స్పందించి, నిజానిజాలను వెలికితీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మైమూనా బేగం కోరారు.

## అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ ప్రతి పేదోడి కళ్ళల్లో ఆనందం చూసే విధంగా పనిచేస్తాం.

### -CMRF మరియు కల్యాణలక్ష్మి చెక్కులు మంజూరు చేయించిన మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ..

పెద్దపల్లి ప్రతినిధి:జూన్ 20: మంథనిలో శనివారం మంత్రి శ్రీధర్ బాబు పర్యటనలో భాగంగా క్యాంప్ కార్యాలయంలో జవీ=ఖీ మరియు కళ్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

మంథని నియోజకవర్గంలోని మంథని, ముత్తారం, రామగిరి, కమాన్ పూర్, పాలకుర్తి మరియు ఇతర మండలాలకు సంబంధించిన 21 లక్షల 41 వేల 100 రూపాయలు చెక్కులను లబ్ధిదారులకు అందచేశారు.

అనంతరం దుద్దిళ్ళ శ్రీధర్ బాబు మాట్లాడుతూ మన రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పరిపాలనలో సింగరేణి కాపాడింది అప్పుడున్న కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు.

అల్లిబిల్లి మాటలతో ఒక పార్టీ తర్వాత ఇంకొక పార్టీ ప్రభుత్వంలో ఉండి టిఆర్ఎస్ పార్టీకి సంబంధించి ఆ కుటుంబంతో విభేదాలతో ఆ కుటుంబం నుంచి బయటికి వచ్చి మాపై చిల్లర ఆరోపణలు చేస్తూ మమ్మల్ని ఏదో చేస్తామంటే ప్రజల ఆశీర్వాదం ఉన్నంతకాలం ఎవరు ఏం చేయలేరని ఈ సందర్భంగా శ్రీధర్ బాబు అన్నారు.

గంగాపురిలో మహిళలకు సంబంధించిన కుట్టు మిషన్ కర్మాగారాన్ని రాబోయే రెండు మూడు నెలల్లో పూర్తి చేసి అనేకమంది మహిళలకు ఉపాధి కల్పిస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

మంథనిలో రోడ్లు వెడల్పు చేసి వీధి దీపాలు డివైడర్లు ఏర్పాటు చేసి సుందరంగా తీర్చిదిద్దడం జరిగిందని రోడ్డు వెడల్పులో గాని వెడల్పులో స్థలాలు కోల్పోయిన వారికి ప్రభుత్వం వారికి అండగా ఉండి వారికి ఆదాయం వచ్చే విధంగా మరో కాడ వెసులుబాటు కల్పిస్తామని తెలిపారు.



కూరగాయల మార్కెట్ మరియు నాన్ వెజ్ మార్కెట్ తాత్కాలికంగా వాగు రోడ్డుపైన ఏర్పాటు చేయడం జరిగింది రాబోయే కొద్ది రోజులలో అధునాతనమైన మార్కెట్ను పూర్తి చేసి వారికి మళ్ళీ తిరిగి కేటాయిస్తామని, ఎవరు అధైర్య పడద్దని అందరికీ అండగా ఉంటామని ఈ సందర్భంగా తెలిపారు.

మంథని పట్టణంలో అత్యధికంగా ఇందిరమ్మ ఇల్లులు ఇవ్వడం జరిగిందని రాబోయే రోజులలో ఇంకా వెయ్యి ఇందిరమ్మ ఇల్లులు ఇవ్వడానికి ఏర్పాట్లు చేస్తున్నామని, మంథని నియోజకవర్గానికి రెండో విడత ఇందిరమ్మ ఇల్లులు త్వరలో ఇవ్వబోతున్నామని ప్రతి పేదోడికి పక్కా ఇల్లు నిర్మిస్తామని తెలిపారు.

అత్యధిక ధాన్యం ప్రభుత్వం సేకరించడం జరిగిందని ఒక్క గింజ కూడా తాలు తప్ప పేరుతో కట్ చేయకుండా, రైతులకు ఖాతాలో డబ్బులు చెల్లించామని శ్రీధర్ బాబు గారు తెలిపారు.

## గ్యార శ్రీనివాస్‌కు దళిత రత్న అవార్డు ప్రదానం



సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో భీమ్ ఫౌండేషన్ తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో గ్యార శ్రీనివాస్‌కు ప్రతిష్టాత్మకమైన “దళిత రత్న అవార్డు” ప్రదానం చేశారు.తెలంగాణ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి కార్మిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టి ఒక సంవత్సరం పూర్తయిన సందర్భంగా, అలాగే రాహుల్ గాంధీ జన్మదినోత్సవం పురస్కరించుకుని ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి చేతుల మీదుగా గ్యార శ్రీనివాస్‌కు దళిత రత్న అవార్డును అందజేశారు. సామాజిక సేవా రంగంలో, బహుజన మరియు కార్మిక వర్గాల అభ్యున్నతికి ఆయన చేస్తున్న సేవలను గుర్తిస్తూ ఈ అవార్డును ప్రదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో భీమ్ ఫౌండేషన్, తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగ సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు, సామాజిక కార్యకర్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొని గ్యార శ్రీనివాస్‌ను అభినందించారు. గ్యార శ్రీనివాస్ మాట్లాడుతూ తనకు లభించిన ఈ గౌరవం మరింత బాధ్యతను పెంచిందని, సమాజ సేవలో మరింత చురుకుగా పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రైవేటు ఉద్యోగ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు గంధం రాములు కందుల ధనలక్ష్మి బెల్లంకొండ జ్యోతి పుష్ప పల్లె సైదమ్మ వాణి శాంత జోగు వెంకట్ చేజర్ల వెంకటరత్నం మొండి ఇంద్ర తదితరులు పాల్గొన్నారు

# ఆర్థిక స్వావలంబన దిశగా మహిళా స్వశక్తీకరణ

## -మున్సిపల్ వైస్ చైర్మన్ శిరీషా సురేందర్ రెడ్డి

జహీరాబాద్, జూన్ : మహిళలను ఆర్థికంగా, సామజికంగా స్వావలంబన దిశగా ఎదగాలని జహీరాబాద్ మునిసిపల్ వైస్ చైర్మన్ కొత్తకాపు శిరీషా సురేందర్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జ్ అండ్ సర్వీసెస్ ఆధ్వర్యంలో కోల్ ఇండియా లిమిటెడ్ ఆర్థిక సహకారంతో నిర్వహిస్తున్న "మహిళా స్వశక్తికరణ నైపుణ్యాభివృద్ధి కార్యక్రమం" కోహిర్ మండలం మాచిరెడ్డి పల్లి లో శనివారం నాడు ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మహిళలను ఉద్దేశించి ప్రసంగించారు. మహిళలను ఆర్థికంగా,సామాజికంగా బలోపేతం చేయడం మరియు స్వయం ఉపాధి అవకాశాలను పెంపొందించడం ప్రధాన లక్ష్యంగా కొనసాగడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం రెండు నెలల కాలపరిమితితో నిర్వహించబడుతుందని, మహిళలకు వివిధ ఉపాధి ఆధారిత రంగాల్లో నైపుణ్య శిక్షణ అందించి, స్వయం ఉపాధి మరియు ఉద్యోగ అవకాశాలను మెరుగుపరచేందుకు అవసరమైన మార్గదర్శకత్వం కల్పించాలని ఆమె నిర్వాహకులను కోరారు.

ఈ కార్యక్రమంలో మెటల్‌కుంట, సజ్జాపూర్, మాచిరెడ్డిపల్లి, దిడ్గి, కవెల్లి, ధనసిరి,వేమారెడ్డి నగర్ గ్రామాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు. ఈ




మహిళా సాధికారత నైపుణ్యాభివృద్ధి కార్యక్రమంలో మొత్తం 12 బ్యాచ్‌లు నిర్వహించబడతాయని, ప్రతి బ్యాచ్‌కు రెండు నెలల పాటు శిక్షణ అందించబడుతుందని వికాస్ సంస్థ నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు పెంపొందించే లక్ష్యంతో ఈ శిక్షణ కార్యక్రమాలు చేపడుతున్నట్లు వారు వివరించారు. కార్యక్రమ ప్రారంభోత్సవానికి మునిసిపల్ వైస్ చైర్మన్ శిరీషా సురేందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొనగా జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, సంస్థ కోఆర్డినేటర్ సురేందర్ రెడ్డి మాట్లాడుతూ మహిళల సాధికారతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలు ఎంతో అవసరమని, ఈ కార్యక్రమం మహిళల ఆర్థిక స్వావలంబనకు బలమైన పునాది వేస్తుందని పేర్కొన్నారు.కోల్ ఇండియా లిమిటెడ్ అందిస్తున్న ఆర్థిక సహకారం ద్వారా గ్రామీణ ప్రాంత మహిళలకు నాణ్యమైన శిక్షణ అందించడం సాధ్యమవుతోందని ఈ మేరకు నిర్వాహకుల కృషి చేయాలని కోరారు. శిక్షణ పొందుతున్న మహిళలు సైతం ఈ కార్యక్రమంపై హర్షం వ్యక్తం చేస్తూ, తమ భవిష్యత్తు ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకోవడానికి ఇది ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అభిప్రాయపడ్డారు.

వివేకానంద ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జ్ అండ్ సర్వీసెస్ సంస్థ భవిష్యత్తులో కూడా మహిళల అభ్యున్నతి, సాధికారత కోసం ఇలాంటి కార్యక్రమాలను కొనసాగించనున్నట్లు వెల్లడించారు.

# రైతు వ్యతిరేక విధానాలతో ముందుకు సాగుతున్న కాంగ్రెస్

## - బిఆర్ఎస్ నేతలు - వేములవాడలో బిఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

వేములవాడ, జూన్ : వేములవాడ పట్టణంలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు నివాసంలో శనివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల మీడియా సమావేశంలో పలువురు బిఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. రైతుల పట్ల ప్రభుత్వం కక్షపూరిత ధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపించారు.

కేసీఆర్ హయాంలో రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చి అనేక పథకాలు అమలు చేశారని, కల్లాల్లో పోసిన వడ్లను, తడిసిన ధాన్యాన్ని కూడా చివరి గింజ వరకు కొనుగోలు చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ఆరు గ్యారెంటీల అమలులో పూర్తిగా విఫలమైందన్నారు.

రైతులకు ప్రకటించిన బోనస్, రైతుబంధు వంటి అంశాలపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూరియా కోసం యాప్ ద్వారా బుకింగ్ విధానం తీసుకురావడం రైతులను ఇబ్బందులకు గురిచేసే చర్యేనని విమర్శించారు. స్మార్ట్ ఫోన్లు వినియోగించలేని రైతులు యూరియాను ఎలా బుక్ చేసుకోవాలని ప్రశ్నించారు.

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంతోనే




లక్షల ఎకరాలకు సాగునీరు అందిందని, ప్రస్తుతం రైతులు నీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రైతుల గోసలను ప్రభుత్వానికి తెలియజేయడానికే ఈ మీడియా సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ రైతుల సమస్యలపై స్పందించి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పాలనలో రైతులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, తెలంగాణ ప్రజలు మళ్లీ కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని అన్నారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీ చైర్పర్సన్ అరుణా రాఘవరెడ్డి, సీనియర్ నాయకులు మనోహర్ రెడ్డి, మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, ప్యాక్స్ చైర్మన్ లు జలగం కిషన్ రావు, తిప్పని శ్రీనివాస్, సింగిల్ విండో వైస్ చైర్మన్ లు మానుపాటి భూమిరెడ్డి, కాశ వేణి మహేష్, సీనియర్ నాయకులు గడ్డం హన్మండ్లు, అజిత్ రావు, రవి కుమార్, మండల అధ్యక్షులు మల్యాల దేవయ్య, గోసుకుల రవి, పట్టణ మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, సిరిగిరి చందు, గోలి మహేశ్, మారం కుమార్, సీనియర్ నాయకులు వెంగళ శ్రీకాంత్ గౌడ్, వాసాల శ్రీనివాస్, మండల నాయకులు, అన్ని మండలాల సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, పట్టణ నాయకులు తదితరులు ఉన్నారు.

# రైతు పండించిన ప్రతి ధాన్యపు గింజను రాష్ట్ర ప్రభుత్వం కొనాల్సిందే

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు

పట్టణ అధ్యక్షులు కుంట లక్ష్మణ్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో అధికారంలోకి రావడం కొరకు అమలు కానటువంటి అడ్డగోలు హామీలు ఎడాపెడ ఇస్తూ ఎన్నో బహిరంగ సభల్లో రైతులను ఆదుకుంటాం రైతులకు అది చేస్తాం ఇది చేస్తాం

కెసిఆర్ రైతుబంధు రెండు ధపాలే వేస్తున్నాడు మరి మూడోదఫా ఎవడు ఏస్తాడు అదే మేము వచ్చిన తర్వాత మూడో దాపా కూడా రైతుబంధు చేస్తామని ప్రాకల్పాలు పలికినటువంటి రాష్ట్ర ముఖ్యమంత్రి ఇప్పుడు పదవి ఎక్కిన తర్వాత మొన్న జరిగినటువంటి యాసంగి ధాన్యం కొనుగోళ్లలో రైతులకు తీవ్రమైన అన్యాయం చేసి సమయానికి ధాన్యాన్ని కాటాలు పెట్టకుండా లారీలు పంపించి ఎత్తకుండా చాలా ఇబ్బందులకు గురి చేసినటువంటి సందర్భం తెలంగాణ రాష్ట్ర రైతాంగం




మొత్తం చూశారు. ఒకవేళ ఖాటా పెట్టి లారీలో ధాన్యం ఎత్తి మిల్లు దగ్గరికి ధాన్యం వెళితే మిల్లర్ పెట్టే అటువంటి ఇబ్బందులు చిత్రహింసలకు రైతులు ఆ యొక్క ధాన్యం బస్తాల మీదనే ప్రాణాలు వదిలినటువంటి పరిస్థితి తెలంగాణ రాష్ట్రంలో కో కొల్లలుగా చూసాం కావున నిన్న తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్రం ఆదేశాల ప్రకారమే ధాన్యం కొంటామని చెప్పడం సిగ్గుమాలిన మాటలుగా మేము అభివర్ణిస్తున్నాం అన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులకు కన్నీరే మిగిలింది తప్ప రైతులు దిక్కుతోచని స్థితిలోకి నెట్టివేయబడ్డారని అన్నారు. ఇప్పటికైనా పద్ధతి మార్చుకొని రైతులకు ఎన్నికల ముందు ఇచ్చినటువంటి మేనిఫెస్టోలో ఏదైతే ఉపయోగమైనటువంటి విషయాలు పెట్టారో వాటిని తక్షణమే అమలు చేయకపోతే బిఆర్ఎస్ పార్టీ నుండి తీవ్రమైనటువంటి పరిణామాలు ఎదుర్కోక తప్పదని వారు హెచ్చరించారు ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి పోశం నరసింహారావు, ముత్యం బాబు, వట్టం రాంబాబు, అడపా అప్పారావు, ఎడ్ల శ్రీనివాస్, ముద్దంగుల కృష్ణ, అక్కి నరసింహారావు, తడికమల ప్రభుదాస్, వేల్పుల సురేష్, జావిద్ పాషా ,తురక రామకోటి, వడ్లూరి రాంబాబు ,వనమాల రాంబాబు, రావులపల్లి వెంకటేశ్వర్లు, బోసెట్టి రవి ,గుర్రం సృజన్ ,జక్కం రంజిత్ కుమార్, తదితరులు పాల్గొన్నారు

# లైన్స్ క్లబ్ అధ్యక్షుడిగా బచ్చు వంశీకృష్ణ

## లైన్స్ క్లబ్ సేవలను మరింత విస్తృత పరుస్తాం

## -నూతన అధ్యక్షుడు వంశీకృష్ణ

వేములవాడ : సుప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి క్షేత్రంలోని వేములవాడ లైన్స్ క్లబ్ అధ్యక్షునిగా బచ్చు వంశీకృష్ణను నియమించారు. పట్టణంలోని మున్నూరు కాపు భవనంలో జరిగిన లైన్స్ క్లబ్ సమావేశంలో బచ్చు వంశీకృష్ణను లైన్స్ క్లబ్ అధ్యక్షునిగా సీనియర్ లయన్ అనంతుల శివప్రసాద్ ప్రకటించారు. వంశీకృష్ణ తో పాటునూతన తో పాటు ప్రధాన కార్యదర్శిగా కొమ్మ నటరాజ్, కోశాధికారిగా డాక్టర్ వినయ్ లను నియమించినట్లు ఆయన ప్రకటించారు. వీరితోపాటు 14 మంది డైరెక్టర్లను సైతం నియమిస్తూ ప్రకటన జారీ చేశారు. అనంతరం నియమితులైన




వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. నూతనంగా ఎన్నికైన బచ్చు వంశీకృష్ణ మాట్లాడుతూ తనపై నమ్మకంతో లైన్స్ క్లబ్ అధ్యక్షునిగా నియామకానికి సహకరించిన లైన్స్ క్లబ్ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. సభ్యులందరినీ ఏకతాటిపై తీసుకువచ్చి లైన్స్ క్లబ్ సేవలను మరింత విస్తృత పరుస్తామన్నారు. ప్రజలకు లైన్స్ క్లబ్ సేవలను విరివిగా అందించేందుకు కృషి చేస్తానన్నారు. పర్యావరణ రక్షణ కోసం ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తామన్నారు. క్లబ్బు సభ్యత్వం పెంచేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షులు డాక్టర్ చీకటి సంతోష్ కుమార్, తీగల వెంకటేశ్వరరావు,రాపెల్లి శ్రీధర్, మారం కుమార్, డాక్టర్ ఆనంద్ రెడ్డి, నగుబోతు రవీందర్, రాజేందర్, మోటూరి శ్రీనివాస్, జమీల్ అహ్మద్ లతోపాటు సీనియర్ జర్నలిస్టులు, న్యాయవాదులు, పెద్ద సంఖ్యలో లయన్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# గాంధీ భవన్‌లో సత్యాగ్రహ దీక్ష




తెలంగాణ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ శ్రీమతి మీనాక్షి నటరాజన్ గారి రాజ్యసభ నామినేషన్‌ను ఎన్నికల సంఘం తిరస్కరించిన తీరుకు నిరసనగా గాంధీ భవన్‌లో రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ ఆధ్వర్యంలో సత్యాగ్రహ దీక్ష

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీపీసీసీ అధ్యక్షులు శ్రీ మహేష్ కుమార్ గౌడ్ గారు, రాజీవ్ గాంధీ పంచాయతీ రాజ్ సంఘటన్ ఆల్ ఇండియా చైర్మన్ శ్రీ సునీల్ పన్వర్ గారు, ఏఐసీసీ కార్యదర్శి శ్రీ సచిన్ సావంత్ గారు హాజరై తమ సంఘీభావాన్ని ప్రకటించారు.

సత్యాగ్రహ దీక్షలో ప్రభుత్వ విప్ శ్రీ ఆది శ్రీనివాస్ గారు, ఎమ్మెల్యే నవీన్ యాదవ్, పలువురు డీసీసీ అధ్యక్షులు, కార్పొరేషన్ చైర్మన్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# మణుగూరు ప్రథమ శ్రేణి కోర్టులో జాతీయ లోక్ అదాలత్ విజయవంతం

## పలు కేసులు రాజీ.. నేరం అంగీకరించిన కేసుల్లో జరిమానాలు..

భద్రాద్రి కొత్తగూడెం : జాతీయ స్థాయిలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా శనివారం మణుగూరు ప్రథమ శ్రేణి న్యాయస్థానంలో భారీ స్థాయిలో పెండింగ్ కేసుల పరిష్కారం జరిగింది. వివిధ రకాల కేసుల్లో రాజీ, నేర అంగీకారం, జరిమానాల ద్వారా గణనీయ సంఖ్యలో కేసులు పరిష్కారమై, కక్షిదారులకు సమయం, ధన వ్యయం తగ్గడంతో పాటు న్యాయస్థానాలపై ఉన్న భారం కూడా తగ్గిందని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించిన సదస్సులో మణుగూరు ప్రథమ శ్రేణి న్యాయమూర్తి కంబపు సూరి రెడ్డి మాట్లాడుతూ, లోక్ అదాలత్ ద్వారా కేసులను పరస్పర రాజీతో త్వరితగతిన పరిష్కరించుకోవచ్చు. దీనివల్ల కక్షిదారులకు న్యాయస్థానాల చుట్టూ తిరిగే అవసరం తగ్గుతుంది. సమయం, ఆర్థిక భారం రెండూ తగ్గడమే కాకుండా, దీర్ఘకాలిక న్యాయ ప్రక్రియ నుంచి ఉపశమనం లభిస్తుందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ వివాదాలను సఖ్యపూర్వకంగా పరిష్కరించుకోవాలని ఆకాంక్షించారు.

పలు కేసుల్లో రాజీ.

మణుగూరు న్యాయస్థానం పరిధిలో పోలీసు, చెక్కు బాకీ, భరణం, గృహ హింస, మద్యం నిషేధ శాఖలకు సంబంధించిన మొత్తం 2,199 కేసులు పెండింగ్‌లో




ఉండగా, జాతీయ లోక్ అదాలత్ ద్వారా 147 కేసులు పరిష్కారమయ్యాయి. వాటిలో 94 పోలీసు కేసులు, 2 చెక్ బౌన్స్ కేసులు పరిష్కారం కాగా, అందులో 42 పోలీసు కేసులు పరస్పర రాజీ ద్వారా ముగిశాయి. మిగిలిన 52 కేసుల్లో నిందితులు నేరాన్ని అంగీకరించడంతో న్యాయస్థానం మొత్తం రూ. 1,15,000 జరిమానా విధించి కేసులను కొట్టివేసింది. మిగతా రెండు షేక్ బౌన్స్ కేసులు ఇరుపక్షాలు రాజీ కుదుర్చుకున్నారు. అలాగే పెట్టి కేసులు 385 పరిష్కారమై రూ.2,16,000 జరిమానా వసూలు చేయగా, ఈ-పెట్టి కేసులు 213 పరిష్కారమై రూ.24,700 జరిమానా విధించారు. ఇక బ్యాంకుల ముందస్తు వివాద పరిష్కారానికి సంబంధించిన 55 కేసులు పరిష్కారమవగా, సంబంధిత బాకీదారులు మొత్తం రూ.30,27,800 చెల్లించడంతో కేసులు ముగిశాయి. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సెక్రటరీ మధు, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ వీరంకి పద్మావతి, న్యాయవాదులు సంధ్య, నాగార్జున్ రెడ్డి, సర్వేశ్వరరావు, రాము, న్యాయస్థాన సిబ్బంది, పోలీసు శాఖ అధికారులు, సంబంధిత కక్షిదారులు పాల్గొన్నారు.

# కట్లపాములతో చెలగాటం

## ప్రాణం కోల్పోయిన యువకుడు

హైదరాబాద్,: పాముతో చెలగాటం ఓ వ్యక్తి ప్రాణం తీసింది. స్నేహితులను భయపెట్టాలని ఆ వ్యక్తి చేసిన పిచ్చి పని అతని ప్రాణాలను బలితీసుకుంది. ఫామ్‌హౌస్‌లో కనిపించిన కట్లపాము పిల్లను చేతిలో తీసుకుని పరచకాలు ఆడటంతో.. అది కాటువేసింది. దీంతో అతను ప్రాణాలు కోల్పోయాడు. హైదరాబాద్‌లోని మొయినాబాద్‌లో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్‌కు చెందిన నవాబ్ జయ్యద్ ఖుమైద్ మొహిద్దీన్ (30) ఒక వ్యాపారవేత్త. తన స్నేహితులతో కలిసి ఇటీవల మొయినాబాద్‌లోని ఒక ఫామ్‌హౌస్‌కు వెళ్లాడు. వారితో సరదాగా గడుపుతున్న సమయంలో అక్కడకు ఒక కట్లపాము పిల్ల వచ్చింది. దాన్ని చూడగానే నవాబ్ దాన్ని చేతుల్లోకి తీసుకున్నాడు. ఆ పాముతో తన స్నేహితును భయపెట్టాలని అనుకున్నాడు. ఆ కట్ల పాముతో ఆటలు ఆడుతూ స్నేహితులను భయపెట్టబోయాడు. కానీ ఇంతలో కుడి చేతి బొటనవేలుపై కాటేసింది. చిన్న పాము కదా.. పెద్దగా ప్రమాదం ఉండదని వాబ్ లైట్ తీసుకున్నాడు. స్నేహితుల ముందు నవ్వుకుంటూ.. తనకు ఎలాంటి ఇబ్బంది లేదని, చికిత్స అవసరం లేదని స్నేహితులతో చెప్పుకొచ్చాడు. కానీ చిన్నదైనా, పెద్దదైనా కట్లపాము విషం అత్యంత ప్రమాదకరమేని అతను తెలుసుకోలేకపోయాడు. ఇంకేముంది.. కొద్దిసేపట్లోనే కట్ల పాము విషం నవాబ్ శరీరంపై ప్రభావం చూపడం మొదలుపెట్టింది. ముందుగా శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారింది. క్రమంగా ఆరోగ్యం కూడా క్షీణించింది. దీంతో ఆందోళన చెందిన స్నేహితులు నవాబ్‌ను వెంటనే ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అప్పటికే విషం శరీరం మొత్తం పాకడంతో నవాబ్ కన్నుమూశాడు. కాగా, దీనికి సంబంధించిన వీడియో ఇప్పుడు వైరల్‌గా మారింది.

# చిట్టీల వ్యాపారం చేస్తున్న టీచర్ సస్పెన్షన్

హన్మకొండ ): చిట్టీల వ్యాపారం నిర్వహిస్తున్న గవర్నమెంట్ టీచర్‌పై వేటుపడింది. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి జడ్పీ పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కలువల ఎల్లయ్యను సస్పెండ్ చేశారు. ఈ మేరకు డీఈవో గిరిరాజ్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వ ఉద్యోగ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు చిట్టీల వ్యాపారం నిర్వహిస్తూ, మోసాలకు పాల్పడుతున్నాడని ఇటీవల కలువల ఎల్లయ్యపై ఫిర్యాదులు వచ్చాయి. ఈ ఆరోపణలపై విచారణ కోసం కలెక్టర్ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ జరిపిన ప్రాథమిక విచారణలో నేరం రుజువు కావడంతో డీఈవో సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారు.

# మోనాలిసా దంపతులకు రక్షణ

## పోలీసులను ఆదేశించిన కేరళ హైకోర్టు

తిరువనంతపురం, : 'కుంభమేళా గర్ల్' మోనాలిసాకు భద్రత కల్పించటంపై కేరళ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. మోనాలిసా, ఆమె భర్త మొహమ్మద్ ఫర్మాన్‌కు భద్రత కల్పించాలంటూ పోలీసులను ఆదేశించింది. ఆ వివరాల్లోకి వెళితే.. మోనాలిసా, మొహమ్మద్ ఫర్మాన్‌కు ఆన్‌లైన్ ద్వారా పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం ప్రేమగా మారి.. మార్చి 11వ తేదీన తిరువనంతపురంలోని అరుమనూర్ ఆలయంలో హిందూ సంప్రదాయం ప్రకారం పెళ్లి చేసుకున్నారు. పెళ్లి తర్వాత మోనాలిసా వయసుపై తీవ్ర స్థాయిలో విమర్శలు మొదలయ్యాయి. ఫర్మాన్ తన కూతురిని కిడ్నాప్ చేసి పెళ్లి చేసుకున్నాడని మోనాలిసా తండ్రి మధ్యప్రదేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ నేపథ్యంలో 'నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్'కు ఫిర్యాదు కూడా వెళ్లింది. 'నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్' మోనాలిసా వయసుపై దర్యాప్తు చేయగా.. ఆమె మైనర్ అని తేలింది. నేషనల్ కమిషన్ ఫర్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ దర్యాప్తులో బయటపడ్డ విషయాల మేరకు పోలీసులు పలు సెక్షన్ల కింద మోనాలిసా భర్తపై కేసులు నమోదు చేశారు. మధ్యప్రదేశ్ పోలీసులు ఫర్మాన్‌ను అరెస్ట్ చేయడానికి ప్రయత్నించగా.. అతడు కేరళ హైకోర్టును ఆశ్రయించాడు. కేరళ హైకోర్టు ఫర్మాన్ ఖాన్‌ను అరెస్ట్ చేయకుండా స్టే విధించింది. ప్రస్తుతం భార్యాభర్తలు ఇద్దరూ కేరళలోనే ఉంటున్నారు. తమ ప్రాణాలకు ముప్పు ఉందంటూ కొద్దిరోజుల క్రితం మోనాలిసా కేరళ హైకోర్టులో పిటిషన్ వేశారు. మతాంతర వివాహం కారణంగా మధ్యప్రదేశ్‌కు చెందిన కొందరు వ్యక్తుల నుంచి తమకు ప్రాణ హాని ఉందని మోనాలిసా తన పిటిషన్‌లో పేర్కొంది. తమకు భద్రత కల్పించేలా ప్రభుత్వానికి, ఎర్నాకులం సెంట్రల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓకు ఆదేశాలు ఇవ్వాలని కోరింది. శనివారం మోనాలిసా పిటిషన్‌పై కోర్టు విచారణ జరిపింది. మోనాలిసా తరఫు న్యాయవాదితో పాటు ప్రభుత్వ ప్లీడర్ వాదనలను విన్న కోర్టు.. పిటిషనర్ ప్రాణానికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని భావించింది. రిట్ పిటిషన్ విచారణ పూర్తయ్యే వరకు మోనాలిసా, ఆమె భర్తకు రక్షణ కల్పించాలని ఎర్నాకులం సెంట్రల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓను ఆదేశించింది. తదుపరి విచారణను జులై 10వ తేదీకి వాయిదా వేసింది.

# ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు కీలక బాధ్యతలు

## ఎఫ్ఏటీఎఫ్‌కు వైస్‌ప్రెసిడెంట్‌గా మధ్యప్రదేశ్ ఐఏఎస్

న్యూఢిల్లీ : ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు తాజాగా కీలక బాధ్యతలు లభించాయి. టెర్రరిస్టుల ఆర్థికమూలాలు, అక్రమ నగదు రవాణా నెట్వర్క్‌లను దెబ్బతీసేందుకు ఏర్పాటు చేసిన ఫైనాన్షియల్ యాక్షన్ టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఏటీఎఫ్)కు వైస్‌ప్రెసిడెంట్‌గా మధ్యప్రదేశ్ కేడర్ ఐఏఎస్ అధికారి వివేక్ అగర్వాల్ ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఉగ్రవాదులకు నిధులు అందకుండా అంతర్జాతీయంగా చేపడుతున్న చర్యల్లో భారత్‌కు పెరుగుతున్న ప్రాధాన్యానికి ఇది నిదర్శనమని రణధీర్ జైస్వాల్ చెప్పారు. ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు ఇది ఒక భారీ విజయమని వ్యాఖ్యానించారు. ఎఫ్ఏటీఎఫ్‌లో ఒక భారత అధికారికి ఇంతటి కీలక బాధ్యతలు దక్కడం ఇదే తొలిసారి. ఐఏఎస్ అధికారి వివేక్ అగర్వాల్ ప్రస్తుతం కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సెక్రటరీగా ఉన్నారు. అంతకుముందే, కేంద్ర ప్రభుత్వంతో పాటు పంజాబ్, మధ్యప్రదేశ్‌లో వివిధ స్థాయిల్లో పలు కీలక బాధ్యతలు నిర్వహించారు. మధ్యప్రదేశ్ కేడర్‌లో చీఫ్ సెక్రటరీ గ్రేడ్ అధికారిగా 2025లో పదోన్నతి సాధించారు. గతంలో ఆయన రెవెన్యూ శాఖ అడిషనల్ సెక్రటరీగా ఉన్నారు.

# రూ.67 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైనేజీ పనుల ప్రారంభం

కరీంనగర్ :నగరపాలక సంస్థ 50వ డివిజన్‌లో రూ.67 లక్షల వ్యయంతో పూర్తిచేసిన నూతన సీసీ డ్రైన్ మరియు సీసీ రోడ్డు ను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ కరీంనగర్ నగర సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి శ్రీ బండి సంజయ్ ప్రత్యేక చొరవతో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద కరీంనగర్ నగరానికి రూ. 840 కోట్ల అభివృద్ధి ప్రతిపాదనలు ఆమోదం పొందినట్లు వెల్లడించారు. గతంలో స్మార్ట్ సిటీ ప్రాజెక్టు ద్వారా దాదాపు రూ. 1000 కోట్ల విలువైన అభివృద్ధి పనులు నగరంలో చేపట్టినప్పటికీ, మరోసారి భారీ స్థాయిలో అర్బన్ ఛాలెంజ్ ఫండ్ లభించడం కరీంనగర్ నగరానికి ప్రత్యేక గుర్తింపుగా నిలిచిందన్నారు. ఈ నిధులతో నగర మౌలిక వసతుల అభివృద్ధి మరింత వేగవంతం కానుందని



పేర్కొన్నారు. రూ. 840 కోట్ల అర్బన్ ఛాలెంజ్ ఫండ్‌కు సంబంధించిన డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్)ను రాబోయే రెండు నెలల్లో సిద్ధం చేసి, అభివృద్ధి పనుల అమలుకు అవసరమైన ప్రతిపాదనలను శరవేగంగా పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కరీంనగర్ నగర అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తూ భారీ స్థాయిలో నిధులు సమకూరుస్తున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గారికి నగర ప్రజల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు , కార్పొరేటర్ ప్రవీణ్ రావు , కార్పొరేటర్ బండ రమణారెడ్డి , స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు మరియు ప్రజలు పాల్గొన్నారు.

# యోధ ప్రధాని బెంజిమెన్ నెతన్యాహు

## ప్రశంసలు కురిపించిన యూఎస్ అధ్యక్షుడు ట్రంప్

వాషింగ్టన్, : లెబనాన్‌లో ఇజ్రాయెల్ సైనిక చర్యల విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు మధ్య తీవ్ర విభేదాలు తలెత్తినట్లు ఇటీవల వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలో నెతన్యాహుపై ట్రంప్ ప్రశంసల జల్లు కురిపించారు. ఆయన్ను యోధ ప్రధానమంత్రిగా అభివర్ణించారు. వాషింగ్టన్ సమీపంలో ఖతార్ కానుకగా ఇచ్చిన నూతన ఎయిర్‌ఫోర్స్ వన్ విమాన ఆవిష్కరణ అనంతరం ట్రంప్ మాట్లాడారు. ఫిబ్రవరి 28న ఇరాన్‌తో యుద్ధం ప్రారంభమైన విషయాన్ని ప్రస్తావిస్తూ.. అమెరికా, ఇజ్రాయెల్‌ల మధ్య చక్కటి పోరాటం జరిగిందన్నారు. 'నిస్సందేహంగా మేం ఇజ్రాయెల్‌తో చాలా బాగా పోరాడాం. ఆ దేశంతో మాకు గొప్ప సంబంధాలున్నాయి. మేము చాలా శక్తిమంతంగా ఉన్నాం. ఇక బీబీ(నెతన్యాహు).. ఓ యోధుడి లాంటి ప్రధానమంత్రి. ఆయన్ను అలాగే గుర్తించాలి. ఆ ఘనత ఆయనకు దక్కాల్సిందే' అని ట్రంప్ పేర్కొన్నారు. లెబనాన్‌లో ఇజ్రాయెల్ యుద్ధాన్ని కొనసాగించాలని ఆ దేశ ప్రధాని తీవ్ర రాజకీయ ఒత్తిడిని ఎదుర్కొంటున్న తరుణంలో ట్రంప్ ఈ రకంగా వ్యాఖ్యానించడం గమనార్హం. ఇక.. లెబనాన్ ప్రాంతంలో ఇజ్రాయెల్ సైనిక చర్యలను, ముఖ్యంగా లెబనాన్‌పై జరగబోయే దాడుల విషయమై ట్రంప్ ప్రస్తావిస్తూ.. అలాంటి నిర్ణయాలపై నియంత్రణ అవసరమన్నారు. యుద్ధాన్ని ముగించేందుకు టెహ్రాన్‌తో ఒప్పందం కుదిరినప్పటికీ.. లెబనాన్‌లో ఇరాన్ మద్దతుగల హెజ్‌బొల్లాపై ఇజ్రాయెల్ సాగిస్తున్న పోరాటం పట్ల ట్రంప్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇటీవల ఓ సంభాషణలోనూ ఆయన నెతన్యాహునుద్దేశించి.. 'నీవు పిచ్చివాడివి. నేను లేకపోతే నువ్వు జైల్లో ఉండేవాడివి. నేనే నిన్ను కాపాడుతున్నాను' అని మాట తూలిన సంగతి తెలిసిందే. కాగా.. ఇరాన్‌తో కుదిరిన శాంతి ఒప్పందాన్ని నెతన్యాహు నిర్వీర్యం చేసే అవకాశముందని అమెరికా నిఘా సంస్థలు ట్రంప్ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నట్లు ది వాషింగ్టన్ పోస్ట్ ప్రచురించింది. ఆ నివేదిక ప్రకారం.. హెజ్‌బొల్లాపై ఇజ్రాయెల్ సైనిక చర్యలను కొనసాగించేందుకు సిద్ధంగా ఉందని తెలుస్తోంది. ఈ ఏడాది చివర్లో ఇజ్రాయెల్‌లో జాతీయ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో లెబనాన్ నుంచి సైన్యాన్ని ఉపసంహరించుకో బోనని, హెజ్‌బొల్లాతో పోరాటాన్ని తీవ్రతరం చేయాలనే తన సంకల్పాన్ని దేశ ప్రజలకు చూపించడంపైనే నెతన్యాహు రాజకీయ మనుగడ ఆధారపడి ఉందని స్థానిక మీడియా సంస్థలు ఉటంకించాయి.

# రాధాగాయత్రిని వేధించిన చంపిన భరత్ శ్రీచరణ్

## శ్రీచరణ్ పెద్ద సైకో అన్న స్నేహితురాళ్లు

## విచారిస్తేనే నిజాలు బయటకొస్తాయని వెల్లడి

హైదరాబాద్: సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రాధాగాయత్రి తన భర్తతో కలిసి ఉత్తరాఖండ్‌లోని ముస్సోరీకి ట్రిప్‌నకి వెళ్లి అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన విషయం తెలిసిందే. ఇప్పటికే రాధాగాయత్రి మృతిపై కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తమ కుమార్తె మృతికి అల్లుడు శ్రీచరణ్ కారణం అంటూ ఆమె తల్లిదండ్రులు ఆరోపించారు. ఢిల్లీ వెళ్లక ముందు హైదరాబాద్‌లో ఆమె పని చేశారు. ఈనేపథ్యంలో రాధాగాయత్రి మృతిపై.. తన స్నేహితులు సంచలన విషయాలు వెల్లడించారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు. గతంలో ఆమెని భర్త మానసికంగా వేధింపులకు గురిచేశాడని మృతురాలి స్నేహితులు ఆరోపించారు. తనకు పదేళ్లుగా రాధాగాయత్రి తెలుసునని ఆమె స్నేహితురాలు చరిత తెలిపారు. రాధాగాయత్రి చాలా మంచి వ్యక్తి అని చెప్పారు. చదువులో ఎప్పుడూ ముందు ఉండేదని.... ఎదుటి వారికి మంచి చేయాలనే మనస్తత్వం ఉందని పేర్కొన్నారు. ఆమె లేదనే విషయాన్ని తాము జీర్ణించుకోలేకపోతున్నామని చెప్పారు. గత ఆరునెలలుగా రాధాగాయత్రి చాలా ఇబ్బందులకు గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. పెళ్లయ్యాక గాయత్రిని శ్రీ చరణ్ ఎప్పుడూ అనుమానిస్తూనే ఉండేవాడని చెప్పారు. తను చెప్పిన విధంగా ఉండాలని.... ఎక్కడికి వెళ్లినా, ఏం చేసినా అనుమానంతో వేధించేవాడని తెలిపారు. గాయత్రి సైకాలజీలో డిగ్రీ కూడా చదివిందని ప్రస్తావించారు. సైకలాజికల్ ఇబ్బందులతో శ్రీ చరణ్ బాధపడేవాడని ఆమె గుర్తించిందని అన్నారు. ఎన్నిసార్లు హింసించిన భర్త వేధింపులు తట్టుకునేదని.... శ్రీ చరణ్ ప్రవర్తనని మార్చాలనుకుని ప్రయత్నించేదని తెలిపారు. ఆమె చనిపోయిన సమయంలో శ్రీ చరణ్ ఏమి జరిగిందో ఇప్పటికీ ఎందుకు చెప్పట్లేదని స్నేహితురాలు చరిత ప్రశ్నించారు. శ్రీ చరణ్ సైకో ప్రవర్తనతో ఉండేవాడని..... అదే విషయం గతంలో తమతో కూడా గాయత్రి చెప్పిందని పేర్కొన్నారు. గాయత్రి మృతిపై మీడియాలో అనేక విధాలుగా ప్రచారం చేస్తున్నారని చెప్పారు. వాస్తవాలు బయటపడేవరకు అవాస్తవాలు ప్రచారం చెయ్యొద్దని కోరుకుంటున్నామని అన్నారు. ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయనే విషయం శ్రీ చరణ్ తల్లిదండ్రులకు తెలుసునని చెప్పుకొచ్చారు. గతంలో యూపీఎస్సీకి గాయత్రి ప్రిపేర్ అవుతానని అడగ్గానే ఆమె భర్త వ్యతిరేకించాడని అన్నారు. అత్తమామలు మాత్రం యూపీఎస్సీ ప్రిపరేషన్‌కి అనుమతి ఇచ్చారని తెలిపారు. పక్కా ప్రణాళికతోనే ముస్సోరికి తీసుకువెళ్లి గాయత్రిని శ్రీ చరణ్ చంపేశాడని ఆరోపించారు. శ్రీ చరణ్ అత్తమామల నుంచి గాయత్రికి ఎలాంటి వేధింపులు లేవని స్పష్టం చేశారు. శ్రీ చరణ్ వేధింపులతో మానసిక ఇబ్బందులకు గాయత్రి గురైందని చెప్పారు. గాయత్రి మృతిపై పోలీసులు పూర్తిస్థాయిలో దర్యాప్తు చేయాలని కోరారు. శ్రీ చరణ్‌ను సమగ్రంగా విచారిస్తే అసలు విషయాలు బయటకు వస్తాయని జీపీఎస్ ట్రాకర్ గుర్తించి పోలీస్ స్టేషన్‌కి వెళ్లి భర్తపై కేసు పెడదామని గాయత్రి అనుకున్నారని తెలిపారు. సమాజంలో తల్లిదండ్రుల పరువు పోతుందని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయలేదని అన్నారు. పెళ్లి అయ్యాక చాలా ఇబ్బందులకు గురైందని తెలిపారు. హైదరాబాద్‌లో ఉన్న సమయంలో అపార్ట్‌మెంట్ వాచ్‌మెన్‌కి చెప్పి ఏదో విధంగా సీసీ ఫుటేజ్ వీడియోస్ తీసుకునేవాడని చెప్పుకొచ్చారు. ఆ వీడియోస్ చూపించి ఆమెని ఇబ్బందులకు ఆమె భర్త గురి చేసేవాడని గాయత్రి స్నేహితురాలు రుక్మిణి పేర్కొన్నారు.

# ఖతార్ పాలకుల ఔదార్యం

## ట్రంప్‌కు 747 జంబో జెట్ గిఫ్ట్

## ఆవిష్కరించిన అమెరికా అధ్యక్షుడు

వాషింగ్టన్, : ఖతార్ పాలకులు తనకు గిఫ్ట్‌గా ఇచ్చిన 747 జంబో జెట్ విమానాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆవిష్కరించారు. ఇకనుంచి ట్రంప్ కొంతకాలం పాటు ఇందులోనే ప్రయాణాలు చేయనున్నారు. ఈ విమానాన్ని ఆయన 'ఎగిరే వైట్‌హౌస్'గా అభివర్ణించారు. జాయింట్ బేస్ ఆండ్రూస్‌లో శుక్రవారం ఈ విమానం ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఇది ప్రపంచంలోనే అత్యంత విలాసవంతమైన విమానం అని ట్రంప్ పేర్కొన్నారు. ఇందులోని ఇంటీరియర్ డిజైన్, ఇంజిన్ల నాణ్యత అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. ఇది ఎయిర్‌ఫోర్స్ వన్ కంటే వేగంగా.. ఎక్కువ దూరం ప్రయాణిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఖతార్ పాలకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జులై 4న జరగనున్న అమెరికా 250వ స్వాతంత్య వేడుకల్లో నిర్వహించే విమానాల ప్రదర్శనల్లో ఈ విమానం కూడా పాల్గొనే అవకాశం ఉందని ట్రంప్ వెల్లడించారు. కాగా.. విమానం లోపల లెదర్ సీట్లు, గోల్డ్ షేడ్స్‌తో కూడిన లేత గోధుమ రంగు గోడలు ఉన్నట్లు మీడియా కథనాలు వెల్లడిస్తున్నాయి. ఇప్పటివరకు 747- 200బి ఎయిర్‌ఫోర్స్ వన్ హోదాలో అమెరికా అధ్యక్షుడికి అధికారిక విమానంగా ఇది వ్యవహరించింది. జార్జ్ హెచ్‌డబ్ల్యూ బుష్ నుంచి ట్రంప్ వరకు ప్రతి అధ్యక్షుడికి ఈ పాత విమానమే సేవలందించింది. అధునాతన విమానం కాకపోయినా సౌకర్యవంతంగా ఉండేదని అమెరికా ప్రొటోకాల్ చీఫ్ మోనికా క్రౌలీ తెలిపారు. ప్రస్తుతం దీని ప్రస్థానం ముగిసింది. యూఎస్ వైమానిక దళం ఆర్డర్ చేసిన రెండు కొత్త బోయింగ్-747 విమానాలు అందేవరకు.. ఖతార్ నుంచి గిఫ్ట్‌గా వచ్చిన ఈ విమానాన్నే ట్రంప్ ప్రయాణాలకు వినియోగించనున్నారు.

# మహారాష్ట్ర యశ్వాడి గ్రామంలో ఘోర ప్రమాదం

## హనుమాన్ ఆలయం పైకప్పు కూలి నలుగురు మృతి

ముంబై, : మహారాష్ట్రలోని పర్భానీ జిల్లా యశ్వాడి గ్రామంలో శనివారం ఘోర ప్రమాదం సంభవించింది. ఇక్కడి ప్రసిద్ధ హనుమాన్ ఆలయంలో నిర్మాణంలో ఉన్న మండపం పైకప్పు భాగం ఒక్కసారిగా కూలింది. ఈ ప్రమాదంలో నలుగురు భక్తులు చనిపోగా, 20 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. మరికొందరు శిథిలాల కింద చిక్కుకున్నారు. నుమాన్ దేవాలయాల్లో శనివారం నాడు భక్తుల రద్దీ సాధారణంగానే ఎక్కువగా ఉంటుంది. యశ్వాడి గ్రామంలోని ఈ ఆలయానికి కూడా ఉదయం నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. భక్తులంతా దర్శనం కోసం వేచి ఉన్న సమయంలో, గత కొన్ని రోజులుగా నిర్మాణంలో ఉన్న మండపం పైకప్పు, దానికి ఆసరాగా ఉన్న ఒక పిల్లర్, గోవా కర్రలు ఒక్కసారిగా కుప్పకూలి కింద ఉన్న భక్తులపై పడ్డాయి. ఈ హఠాత్పరిణామంతో ఆలయ ప్రాంగణంలో ఒక్కసారిగా తీవ్ర కలకలం, భయాందోళనలు రేగాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం.. ఈ ప్రమాదంలో నలుగురు ప్రాణాలు కోల్పోయినట్టు సమాచారం. మరికొందరి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఈ దుర్ఘటనలో దాదాపు 20 మంది భక్తులకు తీవ్ర గాయాలయినట్టు సమాచారం. వెంటనే స్పందించిన స్థానికులు, ఆలయ సిబ్బంది గాయపడిన వారిని సమీపంలోని ఆస్పత్రులకు తరలించారు. సమాచారం అందుకున్న వెంటనే స్థానిక పోలీసులు, సహాయక బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. గత కొన్ని రోజులుగా ఈ సభామండపం నిర్మాణ పనులు జరుగుతున్నాయి. నిర్మాణంలో ఉన్న మండపం కూలిపోవడానికి గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు.

# బండి భగీరథ్‌కు తాత్కాలిక ఉపశమనం

## వారం పాటు బెయిల్ మంజూరు చేసిన కోర్టు

హైదరాబాద :కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌కు న్యాయస్థానంలో ఉపశమనం లభించింది. ఓ యువతిపై లైంగిక దాడి కేసులో అరెస్టై చంచల్‌గూడ జైల్లో రిమాండ్‌లో ఉన్న భగీరథ్‌కు మల్కాజ్‌గిరి కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. ఈ కేసులో గత కొన్ని రోజులుగా భగీరథ్ జైలు జీవితం అనుభవిస్తున్నాడు. తాజాగా ఇంజనీరింగ్ పరీక్షల నేపథ్యంలో న్యాయవాదులు మధ్యంతర బెయిల్ కోరారు. వాదనల విన్న కోర్టు నెల 26 వరకు మధ్యంతర బెయిల్ మంజూరు చేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. ఇదిలా ఉండగా.. గత నెలలో భగీరథ్‌పై పోక్సో చట్టం కింద కేసు నమోదైన విషయం తెలిసిందే. దీంతో అతడిని వెంటనే అరెస్ట్ చేయాలంటూ రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తాయి. కొన్ని రోజులుగా అజ్ఞాతంలో ఉన్న భగీరథ్ మే 17న ఎట్టకేలకు పోలీసులకు లొంగిపోయాడు. ఇక, నిందితుడిని పేట్‌బషీరాబాద్ పోలీసులు గతంలో న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. మేడ్చల్ మేజిస్ట్రేట్ అతడికి 14 రోజుల రిమాండ్ విధించారు. అనంతరం చర్లపల్లి జైలుకు తరలించారు. అంతకుముందు రెండు గంటలకుపైగా సిట్ అధికారులు అతడిని విచారించారు. అప్పటి నుంచి నెల రోజులకు పైగా జైలు జీవితం గడిపిన భగీరథ్ తాజాగా బెయిల్‌పై బయటకు రానున్నాడు.

# నరహరి లాకర్లలో భారీగా డబ్బులు

## కోటిన్నర నగదు స్వాధీనం

## రెండున్నర కిలోల బంగారు ఆభరణాలు

హైదరాబాద్,జూన్ : ల్యాండ్స్ అండ్ సర్వే డిప్యూటీ డైరెక్టర్ సుంకరి నరహరి లాకర్లలో భారీగా నగదు, బంగారు ఆభరణాలు బయటపడ్డాయి. దాదాపు కోటిన్నర నగదుతో పాటు, రెండున్నర కిలోల బంగారు అభరణాలను లాకర్లలో అధికారులు గుర్తించారు. నరహరిపై అవినీతి, అక్రమాస్తుల ఆరోపణలు నేపథ్యంలో ఆయనపై ఏసీబీ అధికారులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. ఈ దర్యాప్తును ఏసీబీ అధికారులు ముమ్మరం చేశారు. ఈక్రమంలో నరహరికి సంబంధించిన బ్యాంకు లాకర్లను బద్దలు కొట్టి కీలక ఆధారాలను సేకరించారు. నరహరి కుటుంబ సభ్యులు లాకర్ తాళాలను అందించేందుకు నిరాకరించడంతో న్యాయస్థానం అనుమతి తీసుకుని ఏసీబీ అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కోర్టు జారీ చేసిన సెర్చ్ వారెంట్ ఆధారంగా బ్యాంకు అధికారుల సమక్షంలో లాకర్లను బద్దలు కొట్టి తనిఖీలు నిర్వహించారు. ఈ ప్రక్రియ మొత్తం నిబంధనల ప్రకారం జరిగింది. ఈ సోదాల సమయంలో లాకర్లలో భారీ మొత్తంలో నగదు, బంగారం ఉన్నట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. లాకర్‌లో రూ. 1.50 కోట్ల నగదుతో పాటు సుమారు రెండున్నర కిలోల బంగారం లభించింది. స్వాధీనం చేసుకున్న బంగారం విలువను అధికారులు అంచనా వేస్తున్నారు.

## మెహదీపట్నం డిపోలో టీజేఎంయూలో భారీ చేరికలు

హైదరాబాద్‌లోని మెహదీపట్నం డిపోలో తెలంగాణ జర్నీ మెన్ యూనియన్ (ఏఓజ)లో భారీ సంఖ్యలో కార్మికులు చేరారు. టీఎంయూ, ఎంప్లాయిస్ యూనియన్‌తో పాటు పలు ఇతర యూనియన్లకు చెందిన ఉద్యోగులు స్వచ్ఛందంగా టీజేఎంయూలో చేరి సంఘానికి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు కొత్తగా చేరిన సభ్యులకు స్వాగతం పలికి సంఘం లక్ష్యాలు, కార్యక్రమాల గురించి వివరించారు. కార్మికుల సమస్యల పరిష్కారం, ఉద్యోగ భద్రత, హక్కుల పరిరక్షణ, సంక్షేమ చర్యల కోసం టీజేఎంయూ నిరంతరం పోరాటం చేస్తోందని నాయకులు పేర్కొన్నారు. ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడడంలో యూనియన్ కీలక పాత్ర పోషిస్తోందనే నమ్మకంతోనే పలువురు ఉద్యోగులు టీజేఎంయూలో చేరారని తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు, కార్మికుల సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని, ఉద్యోగుల సమస్యలను యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. మెహదీపట్నం డిపోలో జరిగిన ఈ భారీ చేరికలు టీజేఎంయూ బలోపేతానికి నిదర్శనమని, భవిష్యత్తులో మరింత మంది కార్మికులు సంఘంలో చేరే అవకాశాలు ఉన్నాయని అభిప్రాయపడ్డారు. కార్మికుల ఐక్యతతోనే హక్కుల సాధన సాధ్యమవుతుందని వారు పిలుపునిచ్చారు.

## జూబ్లీహిల్స్‌లో బంగారు ఆభరణాల చోరీ.. నలుగురు ఉద్యోగులపై కేసు

జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ప్రముఖ జ్యువెలరీ షోరూంలో బంగారు ఆభరణాల చోరీ ఘటన వెలుగులోకి వచ్చింది. షోరూం యజమాని ఫిర్యాదు మేరకు పోలీసులు నలుగురు ఉద్యోగులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గండిపేట రోడ్డులోని విస్లింగ్ వుడ్స్ అపార్ట్‌మెంట్‌కు చెందిన దోసపాటి కార్తీక్ (39), జూబ్లీహిల్స్‌లోని ఎస్‌కేటీ గోల్డ్ అండ్ డైమండ్స్ (మాజీ విశిష్ట గోల్డ్ అండ్ డైమండ్స్) షోరూం యజమాని. షోరూంలో స్టాక్ వెరిఫికేషన్ నిర్వహించగా, మరమ్మతుల కోసం ఉంచిన బంగారు ఆభరణాల్లో 8.2 గ్రాముల బంగారం కనిపించకుండా పోయినట్లు గుర్తించారు. అనంతరం జూన్ 10న కస్టమర్‌కు చెందిన నమూనా బంగారు గొలుసుతో పాటు మరో రెండు బంగారు వస్తువులు కూడా మాయమైనట్లు తేలింది. సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా అనుమానాస్పద కదలికలు కనిపించడంతో ఉద్యోగులపై అనుమానం వ్యక్తమైంది. గత ఏడాది జూలై 13న కూడా 38.020 గ్రాముల బంగారు గొలుసు షోరూం నుంచి కనిపించకుండా పోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే ఆ ఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీ తొలగించబడినట్లు తెలిపారు. మొత్తం 76.385 గ్రాముల బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని, వాటి విలువ సుమారు రూ. 1.52 లక్షలుగా ఉంటుందని ఫిర్యాదుదారు పేర్కొన్నారు. షోరూం ఉద్యోగులు శివకుమార్ భూక్యా, చలపతిరావు, ప్రకాష్, గోవర్ధన్ కలిసి ఈ చోరీలకు పాల్పడి ఉంటారని అనుమానిస్తూ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు జూబ్లీహిల్స్ పోలీసులు న్యాయ  కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ప్రైవేటు బస్సు సీజ్

### ప్రయాణికులకు తిప్పలు

హైదరాబాద్, ఖైరతాబాద్ ఆర్టిఏ అధికారుల నిర్వాకం ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులకు దారి తీసింది. శుక్రవారం రాత్రి  రాత్రి హైదరాబాద్ నుండి రాజస్థాన్ వెళ్తున్న ఒక ప్రైవేట్ ట్రావెల్స్ బస్సును  ఆర్టిఏ అధికారులు  సీజ్ చేసారు. సీజ్ చేసిన సమయంలో బస్సులో  50 మంది ప్రయాణికులు వున్నారు. సీజ్ చేసిన బస్సుతోపాటు ప్రయాణికులను కూడా ఆర్టిఏ ఖైరతాబాద్కు తీసుకువచ్చారు. వారికి ప్రత్యామ్నాయ బస్సు ఏర్పాటు చేయటంలో ఆర్టిఏ అధికారుల విఫలం అయ్యారు. రాత్రంతా సీజ్ చేసిన బస్సులోనే  50 మంది ప్రయాణికులు  వుండిపోయారు. తినడానికి తిండి లేక, వాష్రూమ్స్ కి కూడా లేక తీవ్ర ఇబ్బంది పడి అవస్థలు  ప్యాసింజర్లు ఎదురుకున్నారు. 10 గంటలుగా ఖైరతాబాద్ ఆర్టిఏ లోనే  ట్రావెల్స్ బస్సు వుండిపోయింది. ప్రయాణికులు అధికారులతో వాగ్వాదానికి దిగారు.

## చార్మినార్‌లో అనుమతి లేని ఫాస్ట్ ఫుడ్ గోదాముపై దాడి చేసిన హెచ్-ఫాస్ట్ బృందం

### కల్తీ ఆహార పదార్థాలు స్వాధీనం

హైదరాబాద్, ఆహార కల్తీ మరియు అసురక్షిత ఆహార పద్ధతులపై నిరంతర నిఘాలో భాగంగా, హెచ్-ఫాస్ట్ హైదరాబాద్ ఫుడ్ అడల్ట్రేషన్ సర్వైలెన్స్ టీమ్ బృందం, ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ తో కలిసి చార్మినార్‌లోని హుస్సేనీఆలం పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా నిర్వహిస్తున్న ఒక ఫాస్ట్ ఫుడ్ గోదాముపై ఆకస్మిక దాడి నిర్వహించింది. నమ్మకమైన సమాచారం మేరకు, ఈ బృందం చార్మినార్‌లోని పంచ్ మొహల్లా, న్యూ లాడ్ బజార్‌లో ఉన్న మెసర్స్ అల్ అక్బర్ ఫాస్ట్ ఫుడ్ అండ్ గోడౌన్ ప్రాంగణాన్ని తనిఖీ చేసింది. ఈ తనిఖీలో, ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు కలిగించే విధంగా అత్యంత అపరిశుభ్రమైన మరియు ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఆహార పదార్థాలను తయారు చేయడం మరియు నిల్వ చేయడం జరుగుతున్నట్లు గుర్తించారు. నిర్బంధ ఎఫ్ ఎస్ ఏఎస్ ఎల్ లైసెన్స్ లేకుండా నిర్వహించడం. నిషేధించబడిన-కృత్రిమ ఆహార రంగులను ఎంఎస్ కె లయన్ గ్రీన్ మరియు రాస్ప్బెర్రీ రెడ్, ఉపయోగించడం. పాడైపోయిన మరియు ప్రమాదకరమైన వంట నూనెను పదే పదే ఉపయోగించడం. నీటి విశ్లేషణ ధృవీకరణ మరియు నాణ్యత నియంత్రణ చర్యలు లేకపోవడం. విపరీతమైన అపరిశుభ్ర వాతావరణం, కీటకాల నియంత్రణ. స్వాధీనం చేసుకున్న వివరాలు:సుమారు 110 కిలోల తయారు చేసిన ఫ్రైడ్ చికెన్6 టిన్నుల వంట నూనె ఒక్కొక్కటి 15 లీటర్లు, కృత్రిమ




రసాయన ఆహార రంగులు ఈ అక్రమ కార్యకలాపాలనం నిర్వహిస్తున్న ఇద్దరు బాధ్యులను అదుపులోకి తీసుకున్నారు. అసురక్షిత ఆహార పద్ధతులపై అధికారులకు ఫిర్యాదు చేయండి. ఫిర్యాదుల కొరకు టోల్-ఫ్రీ నంబర్: 8712661212 ను సంప్రదించండి. ఆహార భద్రత మరియు ప్రజారోగ్యాన్ని కాపాడటంలో ప్రజల సహకారం ఎంతో అవసరం.

## రియల్ ఎస్టేట్ లోఅవినీతి సొమ్ముతో కొంటున్న అనకొండలు

హైదరాబాద్, జూన్ 20, (న్యూస్ పల్స్)దేశంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న మెట్రో నగరాల్లో ఒకటైన హైదరాబాద్ స్థిరాస్తి మార్కెట్, ముఖ్యంగా లగ్జరీ హౌసింగ్ విభాగం ప్రస్తుతం విస్మయపరిచే స్థాయి ధరలతో దూసుకుపోతోంది. గచ్చిబౌలి, మాధాపూర్, కోకాపేట, రాయదుర్గం వంటి ప్రాంతాల్లో రూ. 10 కోట్ల నుండి రూ. 50 కోట్ల విలువైన విల్లాలు, సూపర్ లగ్జరీ అపార్ట్‌మెంట్‌లు హాట్ కేకుల్లా అమ్ముడవుతుండటం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. అయితే, ఈ అసాధారణ వృద్ధి వెనుక అసలు కొనుగోలుదారులు ఎవరు? అంత మొత్తం ఎక్కడి నుండి వస్తోంది? అనే అంశంపై ఆర్థిక, రాజకీయ వర్గాల్లో ఒక లోతైన చర్చ నడుస్తోంది. ఈ మార్కెట్‌ను నడిపిస్తున్నది కేవలం ప్రవాస భారతీయులు , నిజాయితీ గల వ్యాపారవేత్తలు మాత్రమే కాదని.. ఇందులో పెద్ద ఎత్తున అవినీతి సొమ్ము నిక్షిప్తమై ఉందని ఇటీవల ఏసీబీ దాడుల్లో దొరుకుతున్న ఆస్తుల వివరాలు వెల్లడిస్తున్నాయి. పక్కా బిజినెస్ మైండ్ ఉన్న ఏ నిజమైన వ్యాపారవేత్త కూడా యాభై కోట్ల రూపాయల భారీ నగదును తెచ్చి ఒకే ఒక లగ్జరీ ఇల్లు లేదా అపార్ట్‌మెంట్‌పై గుడ్డిగా పెట్టుబడి పెట్టడు. ఎందుకంటే, అంత పెద్ద మొత్తాన్ని తమ సొంత వ్యాపారాల్లోనో, స్టార్టప్‌లలోనో లేదా గ్లోబల్ ఈక్విటీ మార్కెట్లలోనో మళ్లిస్తే వచ్చే రాబడి చాలా రెట్లు ఎక్కువగా ఉంటుంది. వ్యాపారులు తమ నివాసం కోసం ఒక సారే లగ్జరీ ఇల్లు కొంటారు కానీ.. కేవలం నెలకు కొన్ని లక్షల రూపాయల అద్దె కోసం రూ. 20 కోట్ల నుండి రూ. 50 కోట్లు బ్లాక్ చేయరు. లగ్జరీ నివాస రంగంలో వార్షిక అద్దె రాబడి కేవలం 2 నుండి 3 శాతానికి మించి ఉండదు. ఇంత తక్కువ రాబడికి ఆశపడి ఏ అచ్చమైన వ్యాపారీ కోట్ల కొద్దీ సత్సంపాదనను ఇక్కడ స్తంభింపజేయడు. హైదరాబాద్ లగ్జరీ రియల్ మార్కెట్‌లో ఊహాజనితంగా పెరుగుతున్న ధరలకు ప్రధాన కారణం అవినీతి సొమ్ము , లెక్కల్లోకి రాని బ్లాక్ మనీ . పన్నుల పరిధిలోకి రాని నల్లధనాన్ని, అవినీతి ద్వారా ఆర్జించిన సొమ్మును సురక్షితంగా దాచుకోవడానికి బడా బాబులు, కొందరు రాజకీయ నేతలు, బ్యూరోక్రాట్లు రియల్ ఎస్టేట్ రంగాన్ని ఒక సేఫ్ హెవెన్ లా వాడుకుంటున్నారు. బినామీల పేరిట, వివిధ అక్రమ మార్గాల ద్వారా ఈ నిధులు లగ్జరీ ప్రాజెక్టుల్లోకి ప్రవహిస్తున్నాయి. ఈ తరహా కృత్రిమ డిమాండ్ ల్లే సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఇళ్లు దొరకని పరిస్థితి ఏర్పడుతోంది. ఒకవేళ ఈ అవినీతి సొమ్ము ప్రవాహం గనుక ఆగిపోతే.. రియల్ ఎస్టేట్ మార్కెట్ ఒక్కసారిగా స్థిరపడి పూర్తిగా క్లీన్ అయ్యే అవకాశం ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు , దర్యాప్తు సంస్థలు రంగంలోకి దిగాల్సిన అవసరం ఉంది. హైదరాబాద్ ఐటీ కారిడార్ చుట్టుపక్కల రూ. 10 కోట్లకు పైబడి జరుగుతున్న ప్రతి లగ్జరీ రియల్ ఎస్టేట్ లావాదేవీని, కొనుగోలుదారుల పూర్తి వివరాలను దర్యాప్తు సంస్థలు సేకరించి క్రాస్-వెరిఫై చేయాలి. సదరు కొనుగోలుదారుల అధికారిక వార్షిక ఆదాయం ఎంత? వారు చెల్లిస్తున్న పన్నులకు, కొనుగోలు చేసిన ఆస్తి విలువకు పొంతన ఉందా? లేదా? అని క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తే అసలు నిజాలు, బినామీల గుట్టు రట్టవుతాయి. పారదర్శకమైన ఇటువంటి ఆడిటింగ్ వ్యవస్థను తీసుకువచ్చినప్పుడే, హైదరాబాద్ రియల్ రంగానికి పట్టిన అవినీతి చీడ వదిలి.. మార్కెట్ నిజమైన కొనుగోలుదారులకు అందుబాటులోకి వస్తుంది

## ఎస్ బీఐ వర్సెస్ ప్రభుత్వం

హైదరాబాద్, జూన్ 20, (న్యూస్ పల్స్)రాయదుర్గం భూముల విషయంలో ఎస్‌బీఐ, రాష్ట్ర ప్రభుత్వం మధ్య వివాదం రోజురోజుకూ తీవ్రం అవుతోంది. ఆ భూమి తమదే అంటూ ఎస్‌బీఐ హైకోర్టును ఆశ్రయించగా.. ధర్మాసనం స్టే ఇచ్చింది. ఈ క్రమంలోనే ఎస్‌బీఐ తీరుపై రేవంత్ సర్కార్ తీవ్రంగా మండిపడింది. ఆ భూమిని తాము గతంలోనే కొన్నామని.. అందులో కొంత భాగం తమదేనని కోర్టును ఆశ్రయించింది. ఈ వివాదంతో ప్రభుత్వానికి ఎస్‌బీఐలో ఉన్న అకౌంట్లను ఇతర బ్యాంకులకు మార్చాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. రాయదుర్గం భూముల వేలం ధరతో మాత్రమే కాకుండా.. వివాదాలతోనూ ఇప్పుడు దేశవ్యాప్తంగా వార్తల్లో నిలిచింది. వేలంలో ఎకరం ధర రూ. 237 కోట్లు పలికి.. అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసిన ఈ భూములపై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) రంగంలోకి దిగింది. రాయదుర్గం నాలెడ్జ్ సిటీ పరిధిలో ఉన్న భూములను రాష్ట్ర ప్రభుత్వం వేలం వేయగా.. అది తమ భూమే అని పేర్కొంటూ.. తెలంగాణ హైకోర్టులో ఎస్‌బీఐ రిట్ పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు.. ఈ వేలం ప్రక్రియపై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ).. ఇటీవల గత నెల 28వ తేదీన రాయదుర్గంలోని సర్వే నంబర్ 83/1లోని అత్యంత విలువైన 11.38 ఎకరాల భూమిని వేలం వేయగా.. రూ. 2,529 కోట్లు రాష్ట్ర ఖజానాకు చేరాయి. అయితే అందులో 5.09 ఎకరాలు తమ భూమి ఉందంటూ ఇప్పుడు ఎస్‌బీఐ పేర్కొంటోంది. 2010లోనే ఆ భూమిని రూ. 13.33 కోట్లకు తాము కొనుగోలు చేశామని ఎస్‌బీఐ వాదిస్తోంది. ఈ భూములను వేలంలో గౌరా వెంచర్స్ అనే సంస్థ ఎకరం భూమిని రూ. 237 కోట్ల చొప్పున దక్కించుకుంది. ఈ నేపథ్యంలోనే ఎస్‌బీఐ వైఖరిపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం సీరియస్ అయింది. రాయదుర్గం భూముల వేలంలో నిబంధనలు ఉల్లంఘించింది ఎస్‌బీఐ అని ఆరోపిస్తోంది. ఈ భూముల వేలంపై ఎస్‌బీఐ, రాష్ట్ర ప్రభుత్వం మధ్య తలెత్తిన వివాదం తీవ్ర పరిణామాలకు దారితీసేలా కనిపిస్తోంది. ఎస్‌బీఐతో రాష్ట్ర ప్రభుత్వానికి ముడిపడి ఉన్న ఆర్థిక సంబంధాలపై పునఃసమీక్ష చేయాలలని రేవంత్ సర్కార్ యోచిస్తోంది. ఎస్‌బీఓలో రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న డిపాజిట్లు, అకౌంట్ల వివరాల సేకరణ, ప్రభుత్వ అకౌంట్లను వేరే బ్యాంకులకు మార్చే అంశాలపై ప్రభుత్వం పునరాలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. అదే జరిగితే ఎస్‌బీఐకి భారీ షాక్ తగలనుందని నిపుణులు పేర్కొంటున్నారు. ఎస్‌బీఐ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను విచారించిన హైకోర్టు.. టీజీఐఐసీ నిర్వహించిన భూముల వేలం ప్రక్రియపై 3 వారాల పాటు స్టే విధిస్తూ తాత్కాలిక ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ వివాదం వెనుక సుదీర్ఘ చరిత్ర ఉంది. గతంలో 2010లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాయదుర్గంలోని సర్వే నంబర్ 83/1లో గల 5 ఎకరాలను అప్పటి స్టేట్ బ్యాంక్ ఆఫ్ హైదరాబాద్ (ఎస్‌బీహెచ్)కు కేటాయించింది. ఆ తర్వాత ఎస్‌బీహెచ్ కాస్తా ఎస్బీఐలో విలీనమైంది. ఆ భూమిని ఆఫీస్ కాంప్లెక్స్, ఐటీ భవనాల కోసం కేటాయించినప్పుడు.. బ్యాంక్ యాజమాన్యం అప్పట్లోనే రూ. 13.33 కోట్లు, ఇతర ఫీజులను ఏపీఐఐసీకి అధికారికంగా చెల్లించింది. దీనికి 2011లోనే ఇరుపక్షాల మధ్య సేల్ అగ్రిమెంట్ కూడా పూర్తి అయింది. ఆ స్థలంలో ఒక ఎస్‌బీఐ బ్రాంచ్‌తోపాటు మూడు ఏటీఎంలను కూడా నిర్మించింది.

## అద్దెలు భరించేది ఎలా...

హైదరాబాద్, జూన్ 20, (న్యూస్ పల్స్)హైదరాబాద్ నగరంలో ఇండ్ల అద్దెలు విపరీతంగా పెరిగిపోతుండడంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ముఖ్యంగా వెస్ట్ హైదరాబాద్‌లోని ఐటీ హబ్‌ను నమ్ముకుని జీవిస్తున్న చిరు వ్యాపారులు, ఉద్యోగులు అద్దెల భారాన్ని తట్టుకోలేకపోతున్నారు. కరోనాకు ముందుతో పోలిస్తే ప్రస్తుతం అద్దెలు రెట్టింపు అయ్యాయి. గచ్చిబౌలి, మాదాపూర్, కొండాపూర్, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ వంటి ప్రాంతాల్లో ప్రస్తుతం 2ఃఊఐ ఫ్లాట్ అద్దె రూ.




25 వేల నుండి రూ. 45 వేల వరకు పలుకుతుండగా, సింగిల్ బెడ్రూమ్ ఇల్లు కూడా రూ. 15 వేలు చెల్లిస్తేనే దొరికే పరిస్థితి ఏర్పడింది. జూనియర్ ఉద్యోగులు తమ జీతంలో 40 నుండి 45 శాతం వరకు కేవలం అద్దెలకే వెచ్చించాల్సి వస్తోంది. ఇటీవలి నివేదికల ప్రకారం ఐటీ కారిడార్‌లో సగటు అద్దెలుగత ఏడాది కంటే 10% నుండి 15% వరకు పెరిగాయి. కోకాపేట్, ఖాజాగూడ ప్రాంతాల్లో లగ్జరీ ఇళ్లకు విపరీతమైన డిమాండ్ ఉండటంతో అక్కడ ఇళ్ల 'వేకెన్సీ రేట్' 2 శాతం కంటే తక్కువగా ఉంది. ఐటీ హబ్‌లోనే కాకుండా మెహిదీపట్నం, అత్తాపూర్, బంజారాహిల్స్, సికింద్రాబాద్ వంటి ప్రధాన ప్రాంతాలతో పాటు, మెట్రో ఫేజ్ 2 పనుల వల్ల ఉప్పల్, ఎల్బీనగర్ వంటి బడ్జెట్ ఏరియాల్లోనూ కిరాయిలు భారీగా పెరుగుతున్నాయికేవలం అద్దె మాత్రమే కాకుండా అపార్ట్‌మెంట్లలో మెయింటెనెన్స్ చార్జీల పేరిట నెలకు రూ. 3 వేల నుండి రూ. 6 వేల వరకు వసూలు చేస్తుండటం మధ్యతరగతి నడ్డి విరుస్తోంది. దీనికి తోడు కరెంట్ బిల్లులు, జూన్ నెలలో వచ్చే స్కూల్ ఫీజుల భారం తోడవడంతో బతుకు బండి లాగడం కష్టంగా మారింది. అనరాక్ నివేదిక ప్రకారం ఇళ్ల కొనుగోలు ధరలు చదరపు అడుగుకు రూ. 9,456కు పెరగడం వల్ల కూడా యజమానులు అద్దెలను పెంచుతున్నారు. ఈ భారాన్ని భరించలేక చాలా కుటుంబాలు నగరాన్ని వదిలి ఓఆర్ఆర్  అవతలి ప్రాంతాలకు వలస వెళ్తున్నాయి.

## ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

### మున్సిపల్ కమిషనర్ కు కార్మికుల వినతి పత్రం

### నరసరావుపేటలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ర్యాలీ, నిరసన

నరసరావుపేట, ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అనుబంధ సంఘం రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా శనివారం నరసరావుపేట మున్సిపల్ ఆఫీస్ వద్ద ధర్నా చేయడం జరిగినది. తదనంతరం నరసరావుపేట మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కమిషనర్ కు  వినతిపత్రం ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమం లో ఏఐటీయూసీ పల్నాడు జిల్లా కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ, మున్సిపల్ కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ కార్మికులందరిని రెగ్యులర్ చేయాలని, పెరుగుతున్న జనాభా ప్రకారం మునిసిపాలిటీ విస్తరణలో భాగంగా అదనంగా కార్మికులను నియమించి పని భారం తగ్గించాలి మున్సిపల్ కార్మికులందరికీ సంక్షేమ పథకాలన్నీ అమలు చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు ఉప్పలపాటి రంగయ్య మాట్లాడుతూ, పిఆర్సి కమిటీ వేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఎక్స్గ్రేషియా ఇవ్వాలని కోరారు. ఈ ధర్నా ను ఉద్దేశించి పట్టణ సిపిఐ కార్యదర్శి సత్యనారాయణ రాజు సంఘీభావం ప్రకటించి కార్మికులకు ఇవ్వవలసిన బెనిఫిట్స్ అన్ని ఇవ్వాలని వారి చేయి పోరాటాలకు, పార్టీ సంఘీభావంగా మద్దతుగా ఉంటుందని తెలియజేశారు. మున్సిపల్ యూనియన్ సెక్రటరీ చిరుగురి జక్రం మాట్లాడుతూ, కనీస వేతనం 36,000 ఇవ్వాలని, కార్మికులందరి కు కూడా ఐ.ఎస్.ఐ కార్డులు ఇవ్వాలని, కార్మికులందరికీ గ్రాడ్యుటి అమలు చేయాలని కోరారు. సమస్యలు అధికారులు ప్రభుత్వం అమలు చేయని ఎడల ఈనెల 22వ తారీఖున స్థానిక ఎమ్మెల్యేలకు వినతిపత్రాలు, 24 వ తారీఖున చలో కలెక్టరేట్, అప్పటికి సమస్యలు పరిష్కారం కాని పక్షాన జులై 7 ఛలో విజయవాడ భారీ ప్రదర్శన ధర్నా నిర్వహించాలని రాష్ట్ర నాయకత్వం పిలుపు ఇచ్చింది. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రెసిడెంట్ దీనమ్మ, జాయింట్ సెక్రెటరీ డేవిడ్, వినుకొండ కొండమ్మ, దయామణి, కొండ్రు శీను, బోదాల యేసు, గల్లిపోగు శివ తదితరులు  పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్లు బంద్

### సర్వర్ నిర్వహణ పనులు?

హైదరాబాద్, జూన్ 20, (న్యూస్ పల్స్)ఇళ్లు, స్థలాలు కొనుగోలు చేసే వారితో పాట రిజిస్ట్రేషన్ పనుల కోసం ఎదురుచూస్తున్న సాధారణ ప్రజలకు రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఒక ముఖ్యమైన సమాచారాన్ని అందించింది. శాఖకు సంబంధించిన ప్రధాన వెబ్‌సైట్‌తో పాటు దానికి అనుబంధంగా పనిచేసే అన్ని ఆన్‌లైన్ సేవలు ఈ నెల 26వ తేదీ నుంచి 28వ తేదీ వరకు తాత్కాలికంగా అందుబాటులో ఉండవని వెల్లడించింది. సర్వర్ల ఆధునీకీకరణ, షెడ్యూల్ చేసిన సాంకేతిక నిర్వహణ పనుల వల్లే ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొంది. రిజిస్ట్రేషన్ల శాఖలో దాదాపు ఐదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఈ స్థాయి సర్వర్ నిర్వహణ పనులను అధికారులు చేపట్టనున్నారు. ఈ పనుల ద్వారా శాఖకు సంబంధించిన ఆన్‌లైన్ సర్వర్ వ్యవస్థలు భవిష్యత్తులో మరింత సజావుగా, ఎలాంటి సాంకేతిక లోపాలు లేకుండా పనిచేస్తాయి. అంతేకాకుండా వినియోగదారుల డేటా భద్రతా ప్రమాణాలను బలోపేతం చేయడం?. ప్రజలకు అందించే సేవల నాణ్యతను మరింత మెరుగుపరచడం కోసం ఈ తాత్కాలిక సాంకేతిక విరామం తప్పనిసరి అయిందని స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు వివరించారు. ఈ మూడు రోజుల విరామం వల్ల ప్రజలకు పెద్దగా ఇబ్బందులు కలగకుండా అధికారులు ఈ షెడ్యూల్‌ను రూపొందించారు. జూన్ 26వ తేదీన మొహర్రం పండుగ సందర్భంగా ప్రభుత్వ సెలవు ఉంది. జూన్ 28వ తేదీన ఆదివారం రావడం వల్ల ఆ రోజు కూడా ప్రభుత్వ అధికారిక సెలవు దినమే అవుతుంది. ఈ రెండు సెలవుల మధ్యలో ఉన్న జూన్ 27వ తేదీన ఒక్కరోజు మాత్రమే ప్రభుత్వ పనిదినంగా ఉంటుంది. ఫలితంగా కేవలం ఒకే ఒక్క వర్కింగ్ డే రోజున మాత్రమే రిజిస్ట్రేషన్ సేవలకు అంతరాయం కలుగుతుందని ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. సాధారణ ప్రజలకు కలిగే అసౌకర్యాన్ని వీలైనంత తగ్గించాలనే ఉద్దేశంతోనే ఈ మూడు రోజుల సమయాన్ని ఎంచుకున్నట్లు ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో భూములు, ఇళ్ల రిజిస్ట్రేషన్లు చేసుకోవాలనుకునే ప్రజలు ఈ మూడు రోజుల విరామాన్ని గమనించాలని అధికారులు సూచించారు. తమ రిజిస్ట్రేషన్ సంబంధిత పనులను, స్లాట్ బుకింగ్స్‌ను ముందస్తుగానే ప్రణాళిక చేసుకోవాలని పేర్కొన్నారు. జూన్ 29వ తేదీ సోమవారం ఉదయం నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు ఎప్పటిలాగే యథావిధిగా పునఃప్రారంభమవుతాయి. శాఖను సాంకేతికంగా మరింత బలోపేతం చేసేందుకు చేపడుతున్న ఈ నిర్వహణ పనులకు ప్రజలు, డాక్యుమెంట్ రైటర్లు, రియల్టర్లు పూర్తిగా సహకరించాలని ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు కోరారు.

## భారీగా తగ్గిన రిజిస్ట్రేషన్లు

కరీంనగర్, జూన్ 20, (న్యూస్ పల్స్)తెలంగాణ ప్రభుత్వం జూన్ 5 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసిన భూముల మార్కెట్ విలువల సవరణ ప్రభావం ద్వితీయ శ్రేణి నగరాలపై తీవ్రంగా పడింది. రాజధాని హైదరాబాద్ వెలుపల రియల్ ఎస్టేట్ రంగానికి ప్రధాన కేంద్రాలుగా ఉన్న ఖమ్మం, వరంగల్, కరీంనగర్ వంటి నగరాల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ప్రస్తుతం జనాలు లేక వెలవెలబోతున్నాయి. గతంలో మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగిన ఓపెన్ ప్లాట్లు, విల్లాలు, అపార్ట్‌మెంట్ల కొనుగోళ్లు.. ఈ ఆకస్మిక ఫీజుల పెంపుతో ఒక్కసారిగా చల్లబడ్డాయి. క్షేత్రస్థాయిలో పెరిగిన ధరల భారాన్ని భరించలేక అటు కొనుగోలుదారులు, ఇటు వెంచర్ల నిర్వాహకులు రిజిస్ట్రేషన్లకు దూరంగా ఉంటున్నారు. గత ఆరేడేళ్ల కాలంలో ఈ నగరాల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం భారీ ఎత్తున ఊపందుకుంది. ప్రతి రోజూ వందలాది డాక్యుమెంట్లు, కొత్త వెంచర్ల రిజిస్ట్రేషన్లతో స్టాంపులు-రిజిస్ట్రేషన్ల శాఖకు కాసుల వర్షం కురిసేది. కానీ, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మార్కెట్ విలువను ఒకేసారి భారీగా పెంచడంతో సీన్ పూర్తిగా రివర్స్ అయింది. రిజిస్ట్రేషన్ల శాతం మారకపోయినా.. భూమి ప్రాథమిక ప్రభుత్వ ధర ను పెంచేయడం వల్ల డాక్యుమెంట్‌కు చెల్లించాల్సిన అసలు రుసుము కొండెక్కి కూర్చుంది. దీనివల్ల మధ్యతరగతి ప్రజలు తమ సొంతింటి కలలను తాత్కాలికంగా వాయిదా వేసుకుంటున్నారు. ఈ మార్కెట్ విలువ పెంపు ఏ స్థాయిలో ఉందో ఖమ్మం నగర పరిసరాల గణాంకాలను గమనిస్తే స్పష్టమవుతోంది. ఖమ్మం శివార్లలోని వేగంగా అభివృద్ధి చెందుతున్న కొన్ని ప్రధాన లేఅవుట్లలో గతంలో [redacted]

# గ్రేటర్ లో ఎన్నికలకు జనసేన కసరత్తు

హైదరాబాద్, జూన్ 20, (న్యూస్ పల్స్)తెలంగాణలో పోటీ చేస్తామని ప్రకటించిన పవన్ కళ్యాణ్.. ఆ దిశగా చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే ఇప్పటికే హైదరాబాద్‌లో జనసేన పార్టీ కార్యాలయం ఉండగా.. తాజాగా మరో కొత్త పార్టీ ఆఫీస్‌ను ప్రారంభించనున్నారు. తెలంగాణలో జనసేనను బలోపేతం చేయడంలో భాగంగా మణికొండలో నిర్మించిన పార్టీ కార్యాలయాన్ని నిర్మించారు. ఇక రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లో జనసేన బరిలో ఉంటామని ప్రకటించిన పవన్.. కసరత్తు మొదలుపెట్టారు.ఆంధ్రప్రదేశ్‌లో జనసేన పార్టీ అధికార కూటమిలో భాగం కాగా.. ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఉపముఖ్యమంత్రి పదవిలో ఉన్నారు. ఈ క్రమంలోనే ఇటీవలి కాలంలో తెలంగాణలో జనసేన పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి పెట్టారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో జనసేన పార్టీ సభ నిర్వహణకు పోలీసులు, హైకోర్టు అనుమతులు ఇవ్వకపోవడం.. అధికార కాంగ్రెస్ నేతలు తీవ్ర విమర్శలు చేయడంతో.. వాటన్నింటికీ సమాధానంగా.. తెలంగాణలో జనసేన పార్టీ ఉంటుందని తేల్చి చెప్పిన పవన్ కళ్యాణ్.. ఏ పార్టీ కలిసి వచ్చినా, రాకపోయినా.. ఒంటరిగానైనా బరిలోకి దిగుతామని స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.ఈ క్రమంలోనే తెలంగాణలోనూ జనసేన పార్టీకి క్షేత్రస్థాయిలో బలం పెంచేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే తెలంగాణపై జనసేన పార్టీ ఫుల్ ఫోకస్ పెట్టింది. ఇటీవలి కాలంలో పవన్ కళ్యాణ్ హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టడం, ఆ తర్వాత ఢిల్లీలో జరిగిన సేన ప్రస్థానం కార్యక్రమంలో తెలంగాణ గురించి ప్రస్తావించడం.. హనుమకొండలో తన అభిమాని నిరంజన్‌ను కలవడం వంటి వరుస సంఘటనలతో.. పవన్ కళ్యాణ్ తెలంగాణపై దృష్టి పెట్టినట్లు స్పష్టంగా అర్థం అవుతోంది. దీంతో తెలంగాణ జనసేన నేతల్లో సరికొత్త ఉత్సాహం నెలకొంది.ఇందులో భాగంగానే రాష్ట్రంలో జనసేన పార్టీని విస్తరించడంలో భాగంగా హైదరాబాద్ మణికొండలో కొత్తగా నిర్మించిన జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయం పనిచేయనుంది. రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఎన్నికల్లో పోటీ చేయడమే లక్ష్యంగా జనసేన పార్టీని బలోపేతం చేయడంతోపాటు.. పార్టీ సంస్థాగత నిర్మాణం కోసం ఈ కొత్త ఆఫీసును ప్రారంభించనున్నట్లు జనసేన వర్గాలు చెబుతున్నాయి.తెలంగాణలో జనసేన పార్టీని బలోపేతం చేసేందుకు తానే స్వయంగా రంగంలోకి దిగుతానని ఇప్పటికే పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే కొత్త ఆఫీస్ ప్రారంభోత్సవం సందర్భంగా పవన్ కళ్యాణ్ ఏం మాట్లాడనున్నారు అనేది ఇప్పుడు సర్వత్రా ఆసక్తికరంగా మారింది. ఇక ఇప్పటికే పవన్ కళ్యాణ్ చేస్తున్న వ్యాఖ్యలు, ఆయన పర్యటనలపై తెలంగాణ కాంగ్రెస్ నేతలు తీవ్ర విమర్శలు గుప్పిస్తుండగా.. తాజాగా జనసేన పార్టీ ఆఫీస్ ప్రారంభోత్సవం గురించి ఎలా స్పందిస్తారోననే ఉత్కంఠ నెలకొందిపక్కా




ప్లాన్ తోజనసేనాని: తెలంగాణ రాజకీయాల్లో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇటీవల ప్రకంపనలు సృష్టించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం నాడు ఆయన తలపెట్టిన సభను కాంగ్రెస్ ప్రభుత్వం అడ్డుకుంది. మరోవైపు కవితతో పాటు భారత రాష్ట్ర సమితి నేతలు సైతం టార్గెట్ చేసుకున్నారు. వారిలో ఒక రకమైన భయం కనిపించింది పవన్ కళ్యాణ్ ద్వారా. ఇప్పుడు అదే నిజం చేస్తున్నారు పవన్. తెలంగాణ రాజకీయాల వైపు తొంగి చూస్తున్నారు. అక్కడే ఉండి రాజకీయాలు చేయనున్నారు. హైదరాబాదులో పార్టీ తెలంగాణ కార్యాలయాన్ని అందుబాటులోకి తెస్తున్నారు. ఈరోజు హైదరాబాద్ ఐటీ కారిడార్ మణికొండలో నూతనంగా నిర్మించిన జనసేన తెలంగాణ రాష్ట్ర కేంద్ర కార్యాలయాన్ని పవన్ కళ్యాణ్ ప్రారంభించనున్నారు. ఇప్పటివరకు పొత్తు ద్వారా, సోషల్ మీడియా ద్వారా తెలంగాణలో ప్రాభవాన్ని చాటుకున్న జనసేన.. పార్టీ కార్యాలయాన్ని అందుబాటులోకి తేవడం ద్వారా తెలంగాణ గడ్డపై సరికొత్త రాజకీయ ప్రస్తానానికి.. అధికారికంగా శ్రీకారం చుట్టబోతుందన్నమాట. × తెలంగాణ నేతల్లో ఆ భయం.. తెలంగాణ రాజకీయ పార్టీల నేతలకు పవన్ కళ్యాణ్ విషయంలో ఒక ఆందోళన ఉంది.. ఏపీలో సైతం పవన్ కళ్యాణ్ చాలా సుదీర్ఘంగా పోరాడి శత శాతం విజయం సాధించారు. ఇక్కడ కూడా అటువంటి ప్రణాళిక రూపొందిస్తే తమకు ఇబ్బందులు తప్పవు అని భయపడుతున్నారు. తెలంగాణ ఆవిర్భావ దినం నాడు హైదరాబాదులో ప్రెస్మీట్లో గట్టిగానే సంకేతాలు పంపారు పవన్. రాబోయే ఎన్నికల్లో జనసేన పూర్తిస్థాయిలో బరిలో దిగుతుందని.. ఇక్కడి క్యాడర్ క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేస్తామని అధికారికంగా ప్రకటించారు. కేవలం ప్రకటనలకే పరిమితం కాకుండా.. ఇప్పుడు ఏకంగా పార్టీ రాష్ట్ర కార్యాలయాన్ని అందుబాటులోకి తీసుకురావడం ద్వారా తెలంగాణ రాజకీయాల్లో సీరియస్ గా దృష్టి పెట్టబోతున్నట్లు స్పష్టమైన సంకేతాలు పంపగలిగారు. × ప్రజల వైఖరిలో మార్పు.. గతం కంటే తెలంగాణ ప్రజల వైఖరిలో స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. గతంలో ప్రత్యేక రాష్ట సెంటిమెంట్ ఎక్కువగా ఉండేది. కానీ ఇప్పుడు మాత్రం ప్రజలు అభివృద్ధికి, సమకాలిన అంశాలకు ఎక్కువగా ప్రాధాన్యమిస్తున్నారు. పైగా తెలంగాణలో ప్రస్తుతం రాజకీయ శూన్యత ఉంది. దానిని భర్తీ చేయడమే అజెండాగా జనసేన పని చేయనుంది. భారత రాష్ట్ర సమితి వరుస అపజయాలతో ఇబ్బంది పడుతోంది. అధికార కాంగ్రెస్ పార్టీ పట్ల కొన్ని వర్గాల్లో అసంతృప్తి ఉంది. బిజెపి బలం పుంజుకున్నప్పటికీ నాయకత్వం సమస్య వెంటాడుతోంది. ఇటువంటి తరుణంలో ఏపీ మాదిరిగా తెలంగాణలో సైతం జనసేన ప్రత్యేక ఓటు బ్యాంకు కొల్లగొట్టాలని చూస్తోంది. ముఖ్యంగా గ్రేటర్ పరిధిలో సెటిలర్స్, ఉద్యోగులు ఉన్న ప్రాంతాల్లో జనసేన బలం పెంచుకోవాలని భావిస్తోంది. యువతతో పాటు విద్యార్థుల ఓట్లపై గురిపెడుతోంది. × సమయం కేటాయింపు.. ప్రస్తుతం ఏపీ డిప్యూటీ సీఎం గా పవన్ కళ్యాణ్ ఉన్నారు. కీలక మంత్రిత్వ శాఖలను నిర్వహిస్తున్నారు. అయితే హైదరాబాదులో నివాసం ఉన్న దృష్ట్యా అక్కడి నుంచి రాకపోకలు సాగిస్తున్నారు. అందుకే వారంలో ఒకరోజు తెలంగాణ కార్యకలాపాలకు కేటాయించే అవకాశం ఉంది. వారాంతంలో షెడ్యూల్ తెలంగాణ కార్యాలయానికి కేటాయిస్తారని సమాచారం. రాబోయే రోజుల్లో తెలంగాణలో ఒక బలమైన ప్రత్యామ్నాయ శక్తిగా జనసేన మారే అవకాశాలు పుష్కలంగా కనిపిస్తున్నాయి. చూడాలి

## అన్నదాతలను మోసం చేస్తున్న కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా బీజేపీ నిరసన




నార్నూర్ : అన్నదాతలను కాంగ్రెస్ ప్రభుత్వం అడుగడుగునా మోసం చేస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు బిక్షపతి అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు.వానకాలం సీజన్ ప్రారంభమైనప్పటికీ రైతులకు రైతు భరోసా పెట్టుబడి సహాయాన్ని అందించకపోవడంతో రైతులు విత్తనాలు, ఎరువులు అప్పులు చేసి కొనుగోలు చేయవలసిన పరిస్థితి ఏర్పడిందని ఆరోపించారు. యాసంగి సాగులో కూడా రెండు ఎకరాల వరకే రైతు భరోసా అందించి మిగతా రైతులకు మొండి చేయి చూపించారన్నారు. ప్రతి రైతుకు రైతు భరోసా అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దేవి దాస్, రాజు, శ్రీకాంత్, రవి తదితరులు ఉన్నారు.

## ప్రతీ రైతు పరిస్థితి ఇదే.. పాండురంగ్ కుటుంబానికి ధైర్యం చెప్పాలని కేసీఆర్ మమ్మల్ని పంపారు : కేటీఆర్



ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం పొన్న గ్రామంలో కాంగ్రెస్ ప్రభుత్వం పంట కొనకపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న రైతు నుగూరే పాండురంగ్ కుటుంబాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఇతర బీఆర్ఎస్ నాయకులతో కలిసి పరామర్శించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. పాండురంగ్ కుటుంబానికి కనీసం రుణమాఫీ కాలేదు, రైతుబంధు కూడా పడటం లేదని.. రాష్ట్రంలో ఉన్న ప్రతీ రైతు పరిస్థితి ఇదేనన్నారు.రైతు పాండురంగ్ కుటుంబానికి ధైర్యం చెప్పడానికి నాతోపాటు మాజీ మంత్రి ప్రశాంత్‌రెడ్డి, హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి, కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్, రాథోడ్, జిల్లా ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇక్కడికి పంపించారన్నారు. రైతు ఫొటో, వార్త చూసి కేసీఆర్ చలించిపోయి ఆ కుటుంబానికి ధైర్యం చెప్పాలన్నారు. వాళ్లకు ఏం ధైర్యం చెప్పాలని అడిగితే రెండేళ్లు ధైర్యంగా బతకండి.. రెండేళ్లలో మళ్లీ కేసీఆర్ వస్తడు. మళ్లా మిమ్మల్ని అందరినీ కండ్లల్ల పెట్టుకొని చూసుకుంటడని భరోసా ఇవ్వాలన్నాని చెప్పారు.దయచేసి ధైర్యంగా ఉండండి.. ధైర్యాన్ని కోల్పోయి ఆత్మహత్యలకు పాల్పడి కుటుంబాలను ఆగం చేయొద్దని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. చనిపోయిన ప్రతీ రైతు కుటుంబానికి పాండురంగ్ కుటుంబంతో సహా కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. చదువుకునే పిల్లలుంటే వారికి ప్రత్యేకంగా ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఎందుకంటే నువ్వు ధాన్యం కొనక లంచం సిస్టమ్ పెట్టి క్వింటాల్‌కు రూ.50 అని పెట్టి లారీ ఎక్కించేందుకు లంచం, దించేందుకు లంచం.. సంచులు, సుతీలు, బార్దాన్ ఏదీ ఇయ్యవ్.. ఆఖరికి ఎండాకాలంలో మార్కెట్ యార్డ్‌లలో మంచినీళ్లు కూడా ఇయ్యవని మండిపడ్డారు.రైతుల గోస పుచ్చుకునే ఖచ్చితంగా అవి ప్రభుత్వం చేయించిన హత్యలేనన్నారు. నువ్వు చేయించిన హత్యలే రేవంత్ రెడ్డి అందుకే ఆ కుటుంబానికి ఆదుకునే బాధ్యత, అండగా నిలవాల్సిన బాధ్యతరాష్ట్ర ప్రభుత్వం మీదనే ఉందన్నారు.

## ‘ధాన్యం కొనుగోళ్లపై క్యాబినెట్ తీర్మానాన్ని ఖండిస్తున్నాం’



తుంగతుర్తి, జూన్ 20 : ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి వానకాలం పంటలపై రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ ఎంపీపీ, బీఆర్ఎస్ తుంగతుర్తి మండల మాజీ అధ్యక్షుడు సీతయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. వానాకాలంలో రైతులు పండించిన ధాన్యాన్ని పూర్తిస్థాయిలో ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.యూరియా పంపిణీలో యాప్ విధానం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఈ కార్యక్రమంలో గుండగాని రాములుగౌడ్ మండల నాయకులు గోపగాని రమేశ్. తడకమళ్ల రవికుమార్, మల్లేపక రాములు, గడ్డం సోమేశ్, బానోతు పూర్ణ నాయక్, గునిగంటి యాదగిరి, మల్యాల రాములు, సర్పంచ్ మనోజ్, గోపగాని వెంకన్న, కొండగడుపుల వెంకటేష్, నల్లబెల్లి వెంకటేష్, కొండగడుపుల శ్రీకాంత్, తడకమళ్ల మధు, బొజ్జ సాయికిరణ్ పాల్గొన్నారు.

## ట్రంప్ మాట లెక్కచేయని నెతన్యాహు.. లెబనాన్‌పై మళ్లీ ఇజ్రాయెల్ దాడులు.. ఐదుగురు మృతి

పశ్చిమాసియాలో యుద్ధాన్ని నివారించి ఇరాన్‌తో శాంతి ఒప్పందానికి అమెరికా సిద్ధమవుతుంటే.. ఈ ప్రయత్నాలకు ఇజ్రాయెల్ గండికొడుతోంది. లెబనాన్‌పై వరుసగా దాడులు చేస్తోంది. శనివారం కూడా లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేసింది. దక్షిణ లెబనాన్‌పై ఈ రోజు ఇజ్రాయెల్ జరిపిన దాడిలో ఐదుగురు మరణించారు. హెజ్బొల్లా, ఇజ్రాయెల్ మధ్య శాంతి ఒప్పందం కుదిరిందని అమెరికా ప్రకటించిన కొన్ని గంటల వ్యవధిలోనే.. ఇజ్రాయెల్ దాడికి దిగడం విశేషం.ఈ దాడిపై లెబనాన్ మీడియా వెల్లడించిన వివరాల ప్రకారం.. దక్షిణ లెబనాన్‌లోని నబాతే జిల్లాలోని అనేక ప్రదేశాలపై ఇజ్రాయెల్ డ్రోన్ దాడులు చేసింది. ఈ దాడుల్లో అనేక ఇండ్లు, బిల్డింగులు ధ్వంసమయ్యాయి. ఐదుగురు మరణించారు. ఫిరంగి దాడులు కూడా జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. కొద్ది రోజులుగా వరుసగా లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేస్తోంది. అంతకుముందు శుక్రవారం జరిపిన దాడుల్లో కూడా 16



మంది మరణించారు. అనేకమంది గాయపడగా, పలువురు కూలిన బిల్డింగులు, ఇండ్ల శిథిలాల కింద చిక్కుకుపోయారు. అయితే, ఇజ్రాయెల్ దాడులపై అమెరికా ఆగ్రహంగా ఉంది. ఒకపక్క ఇరాన్‌తో అమెరికా శాంతి ఒప్పందం కుదుర్చుకుని, యుద్ధాన్ని ముగించాలని భావిస్తుంటే.. ఇజ్రాయెల్ మాత్రం ఇరాన్ మిత్రదేశమైన లెబనాన్‌పై దాడులు చేస్తోంది. అక్కడ ఇరాన్ మద్దతుతో నడుస్తున్న హెజ్బొల్లా ఉగ్రవాద శిబిరాల్ని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ దాడి చేస్తోంది.ఈ దాడుల్ని ఇరాన్ ఖండిస్తోంది. ఇజ్రాయెల్

## వర్షాకాల సవాళ్లను ఎదుర్కొనేందుకు సర్వసన్నద్ధం : నల్లగొండ మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర

### 24 గంటల కంట్రోల్ రూమ్

### టౌన్-I, టౌన్-2 ప్రత్యేక రెస్క్యూ బృందాలతో ప్రజలకు భరోసా

### అత్యవసర సమస్యలపై తక్షణ స్పందన


నల్లగొండ, జూన్ 20 : రానున్న వర్షాకాలంలో భారీ వర్షాలు, నీటి నిల్వలు, డ్రైనేజీలు పొంగిపొర్లడం, చెట్లు కూలిపోవడం, రోడ్లు దెబ్బతినడం, తాగునీటి సరఫరా అంతరాయాలు, విద్యుత్ సమస్యలు, ఇతర అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ సమగ్ర కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసింది. మేయర్ ఆదేశాలు, మున్సిపల్ కమిషనర్ బి.శరత్ చంద్ర ప్రత్యక్ష పర్యవేక్షణలో నగర వ్యాప్తంగా



ప్రత్యేక మాన్‌సూన్ సన్నద్ధత చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ప్రజల భద్రత, ఆస్తుల రక్షణ, అత్యవసర పరిస్థితుల్లో తక్షణ సహాయ చర్యల కోసం 24 గంటల మాన్‌సూన్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడంతో పాటు నగరాన్ని టౌన్-1, టౌన్-2 ప్రాంతాలుగా విభజించి ప్రత్యేక రెస్క్యూ బృందాలను ఏర్పాటు చేశారు.కమిషనర్ బి.శరత్ చంద్ర ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన ఈ బృందాలలో వార్డు అధికారులు, శానిటరీ జవాన్లు, వాటర్ సప్లయ్ సిబ్బంది, ఎలక్ట్రిషియన్ సిబ్బంది, హరితహారం బృందాలు, ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ, శానిటేషన్ విభాగాల అధికారులు, సిబ్బంది సహా 150 మందికి పైగా సిబ్బంది పాల్గొంటున్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన అందించేందుకు ఈ బృందాలు 24 గంటలూ సిద్ధంగా ఉండనున్నాయి.కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్ : 08682 ? 220100ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి వెంటనే సంబంధిత బృందాలకు చేరవేసి సమస్యలను పరిష్కరించేందుకు కంట్రోల్ రూమ్‌లో మూడు షిఫ్టుల్లో సిబ్బంది విధులు నిర్వహించనున్నారు.వర్షపు నీరు ఎటువంటి అవరోధం లేకుండా ప్రవహించేలా నగరంలోని ప్రధాన డ్రైన్లు, వర్షపు నీటి కాలువలు, కల్వర్టులు మరియు లోతట్టు ప్రాంతాలలో విస్తృత స్థాయిలో డీసిల్టింగ్ పనులు చేపట్టినట్లు కమిషనర్ తెలిపారు. వర్షాకాలంలో నీటి నిల్వలు ఏర్పడకుండా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారని పేర్కొన్నారు.డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులను నివారించేందుకు నగరంలోని అన్ని డివిజన్లలో ప్రతిరోజూ ఫాగింగ్, యాంటీ లార్వా స్ప్రేయింగ్, పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.? భారీ వర్షాల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరం కాకపోతే ఇళ్ల నుండి బయటకు రావద్దని కమిషనర్ బి.శరత్ చంద్ర సూచించారు.? అలాగే ప్రజలు ఇంటి చెత్తను డ్రైనేజీలు, కాలువలు అలాగే రోడ్లపై వేయకుండా ప్రతిరోజూ వచ్చే మున్సిపల్ పారిశుధ్య వాహనాలకు మాత్రమే అందించాలని కోరారు.? డ్రైనేజీలలో చెత్త వేయడం వల్ల నీటి ప్రవాహానికి అంతరాయం ఏర్పడి వరద పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు.నగరంలో ఎక్కడైనా చెట్లు కూలిపోవడం, డ్రైనేజీలు మూసుకుపోవడం, నీటి నిల్వలు ఏర్పడడం, తాగునీటి సరఫరా సమస్యలు, వీధి దీపాల లోపాలు, రోడ్లు దెబ్బతినడం, ప్రమాదకర భవనాలు లేదా గోడలు కూలే పరిస్థితులు, ఇతర అత్యవసర సమస్యలు గమనించిన వెంటనే నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ 24ౖ7 కంట్రోల్ రూమ్ 08682 ? 220100 కు సమాచారం అందించాలని కమిషనర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## విద్యార్థి నాగ్‌పూర్‌లో.. నీట్ పరీక్ష కేంద్రం యూఏఈలో..

నీట్ రీటెస్టుకు సంబంధించి తనకు యూఏఈలో పరీక్ష కేంద్రాన్ని కేటాయించారని నాగ్‌పూర్‌కు (మహారాష్ట్ర) చెందిన ఒక విద్యార్థి తెలిపాడు. ఈ విషయాన్ని ఎన్‌టీఏ దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్టు విద్యార్థి తండ్రి చెప్పారు. ప్రశ్నపత్రం లీక్ నేపథ్యంలో రద్దైన నీట్ ఎంట్రన్స్ పరీక్షను రేపు మరోసారి నిర్వహించనున్న విషయం తెలిసిందేరీ-నీట్ అడ్మిట్ కార్డు డౌన్‌లోడ్ చేసుకుని చూస్తే జరిగిన పొరపాటు గురించి తెలిసిందని అబ్దుల్లా మొహమ్మద్




తాలిబ్ అనే విద్యార్థి తెలిపాడు. తాను భారత్‌లో ఉంటే తన పరీక్ష కేంద్రం మాత్రం యూఏఈలో ఉన్నట్టు అడ్మిట్ కార్డులో కనిపించిందని అన్నాడు. నాగ్‌పూర్‌లో పరీక్ష కేంద్రం కోసం అతడు దరఖాస్తు చేసినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.ఈ విషయం ఎన్‌టీఏ దృష్టికి తీసుకెళ్లగా సాంకేతిక సమస్య కారణంగా ఇలా జరిగిందని సంస్థ తెలిపినట్టు విద్యార్థి తండ్రి తెలిపారు. సమస్యను పరిష్కరిస్తామని, సవరించిన అడ్మిట్ కార్డును జారీ చేస్తామని పేర్కొన్నట్టు చెప్పారు. ఈ మేరకు ఎన్‌టీఏ నుంచి ఈమెయిల్ వచ్చిందని వెల్లడించారు.

## బంగ్లాదేశ్‌లో హిందువుల నిరసన.. ఢాకాలో భారీ ర్యాలీ

బంగ్లాదేశ్‌లో మళ్లీ ఉద్రిక్తతలు చెలరేగాయి. శ్రీరాముడి చిత్రంపై చెప్పు ఉంచి తమ మతవిశ్వాసాలను అవమానించారంటూ రాజధాని ఢాకాలో హిందువులు కాగడాలు, కొవ్వొత్తులతో శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. జై శ్రీరామ్ అంటూ పెద్ద ఎత్తున నినదించారు. ఉత్తర గాయిబంద జిల్లాలో శ్రీశ్రీ రాధాగోవింద దేవాలయ కమిటీ 81 అడుగుల శ్రీరాముడి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు రంగంలోకి దిగింది. అయితే, అతివాదుల నుంచి బెదిరింపులు రావడంతో కార్యక్రమం వాయిదా పడింది. ఈ నేపథ్యంలో తాజాగా కొందరు అవమానకర చర్యలకు దిగడంతో పరిస్థితి మరోసారి ఉద్రిక్తంగా మారినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఈ క్రమంలో ఢాకాలో వేల మంది హిందువులు నిరసనకు దిగారు. పలు హిందూ సంఘాల ఆధ్వర్యంలో జై శ్రీరామ్ అని నినదిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు.ర్యాలీకి తరలి రావాలన్న హిందూ మహాజ్యోత్ సంస్థ పిలుపు మేరకు శుక్రవారం సామాన్య ప్రజలు, ఇతర హిందూ సంఘాలు షహబాగ్ కూడలికి పెద్ద సంఖ్యలో వచ్చారు. అక్కడి నుంచి నేషనల్ ప్రెస్ క్లబ్ వరకూ ర్యాలీగా వెళ్లారు. ప్రెస్‌క్లబ్ ముందు భారీ మానవహారంతో నిరసన తెలిపారు. మరికొంత మంది ఢాకా రిపోర్టర్స్ యూనిటీ భవనం ముందు నిరసన చేపట్టారు. రంగపూర్‌లో నిరసన తెలిపిన వారిని పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఉద్రిక్తతలు పెరిగాయి. మైనారిటీలు ఇన్ని ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం మౌనంగా ఉంటోందని నిరసనకారులు ఆరోపించారు. తమ మతవిశ్వాసాలను అవమానించిన వారిని 72 గంటల్లోగా అరెస్టు చేయాలని అల్టిమేటమ్ జారీ చేశారు. లేని పక్షంలో నిరసనలు మరింత తీవ్రమవుతాయని హెచ్చరించారు.



కింగ్




# సినిమా

## అనిల్ రావిపూడి మరో మల్టీస్టారర్ ప్రాజెక్ట్

### వెంకటేశ్, కళ్యాణ్ రామ్ మూవీకి శ్రీకారం




టాలీవుడ్‌లో మరో భారీ మల్టీస్టారర్ చిత్రానికి తెరలేచింది. సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వంలో విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్ హీరోలుగా తెరకెక్కబోతున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ పూజా కార్యక్రమాలు హైదరాబాద్‌లో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకకు దిగ్గజ దర్శకుడు రాఘవేంద్రరావుతో పాటు ప్రముఖ నిర్మాత అల్లు అరవింద్ తదితరులు విచ్చేసి క్లాప్ కొట్టారు. ఇక ఈ సినిమాలో నటించబోయే కథానాయికలకు సంబంధించిన అధికారిక ప్రకటన కూడా వచ్చేసింది. ఈ హిలేరియస్ ఎంటర్‌టైనర్‌లో వెంకీ మామకు జోడీగా నేషనల్ అవార్డ్ విన్నర్ కీర్తి సురేష్ నటిస్తోండగా.. నందమూరి హీరో కళ్యాణ్ రామ్ సరసన టాలెంటెడ్ బ్యూటీ కృతి శెట్టి సందడి చేయనుంది. అనిల్ రావిపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు నేషనల్ అవార్డ్ గ్రహీత జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తుండగా.. సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సురేష్ ప్రొడక్షన్స్ మరియు జీ స్టూడియోస్ సంయుక్తంగా ఈ ప్రాజెక్ట్‌లో భాగస్వామ్యం వహిస్తున్నాయి. అనిల్ రావిపూడికి బాగా కలిసివచ్చిన సంక్రాంతి సీజన్‌నే ఈ సినిమాకు కూడా లాక్ చేశారు. 2027 సంక్రాంతి కానుకగా ఈ అవుట్ అండ్ అవుట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. దగ్గుబాటి మరియు నందమూరి వంశాల హీరోలు కలిసి నటిస్తుండటంతో, అనిల్ రావిపూడి మార్క్ కామెడీ అండ్ యాక్షన్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై అటు అభిమానుల్లో, ఇటు సాధారణ ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది.




## థియేటర్లలో పెద్ది..రీలోడెడ్ వర్షన్

### మరో ఆరు నిముషాల అదనపు దృశ్యాలు జోడింపు




మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ అభిమానులు ఎప్పటినుంచో ఎదురుచూస్తున్న 'పెద్ది' సినిమాకు సంబంధించి మేకర్స్ క్రేజీ అప్‌డేట్ ఇచ్చారు. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా ఇప్పుడు సరికొత్త 'రీలోడెడ్ వెర్షన్'తో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. దాదాపు 5 నిమిషాల 56 సెకన్ల నిడివి గల అదనపు దృశ్యాలను జోడించి నేటి నుంచి థియేటర్లలో ప్రదర్శించనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ కొత్త ఫుటేజ్‌లో కథానాయిక జాన్వీ కపూర్‌కు సంబంధించిన ఎమోషనల్ సీన్స్‌తో పాటు, సీనియర్ నటుడు జగపతి బాబు నటించిన కీలకమైన సన్నివేశం కూడా ఉండటం విశేషం. ఈ అదనపు ఐదున్నర నిమిషాల సీన్స్ సినిమా ఎమోషన్‌ను, డ్రామాను మరో స్థాయికి తీసుకెళ్తాయని మేకర్స్ చెబుతున్నారు. ఇప్పటికే థియేటర్లలో సందడి చేస్తున్న 'పెద్ది'కి ఈ రీలోడెడ్ వెర్షన్ మరింత బూస్ట్ ఇస్తుందని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు భారీ బడ్జెట్‌తో నిర్మించిన ఈ చిత్రంలో కన్నడ స్టార్ శివ రాజ్‌కుమార్, బాలీవుడ్ నటుడు దివ్యేందు శర్మ, బోమన్ ఇరానీ వంటి పాన్ ఇండియా తారాగణం కీలక పాత్రల్లో మెరిశారు. ఏఆర్ రెహమాన్ సంగీతం, రత్నవేలు సినిమాటోగ్రఫీ సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయి. ఇప్పటికే మాస్, ఫ్యామిలీ ఆడియెన్స్‌ను ఆకట్టుకున్న 'పెద్ది'.. కొత్త సీన్ల జోడింపుతో బాక్సాఫీస్ వద్ద మరిన్ని రికార్డులు బద్దలు కొడుతుందా అనేది ఆసక్తిగా మారింది. థియేటర్లలో 'పెద్ది' రీలోడెడ్ వెర్షన్‌ను మిస్ అవ్వొద్దని చిత్రయూనిట్ మెగా ఫ్యాన్స్‌కు పిలుపునిచ్చింది.




## ఇండియా స్టోరీ పోస్టర్ విడుదల




బాలీవుడ్ నటులు కాజల్ అగర్వాల్, శ్రేయాస్ తల్పడే ప్రధాన పాత్రల్లో నటిస్తున్న పాన్ ఇండియా సోషియో నేషనల్ డ్రామా 'ది ఇండియా స్టోరీ' ఫస్ట్ లుక్ పోస్టర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. జీ స్టూడియోస్ సమర్పణలో ఎంఐజీ ప్రొడక్షన్స్ / స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి చెత్తన్ డీకే దర్శకత్వం వహిస్తుండగా, సాగర్ బి. షిండే కథ, స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. సుమిత్ బగడే, అనితా జాదవ్, వినాయక్ సైదానీ, కల్పేష్ షా, దేవయాని ఖోరటే, ప్రేమ్ జోషి ఈ చిత్రానికి సహ నిర్మాతలుగా ఉన్నారు. దేశంలో తీవ్రమవుతున్న ఆహార కల్తీ, వ్యవసాయంలో రసాయనాలు, పురుగుమందుల మితిమీరిన వాడకం వెనుక ఉన్న కుంభకోణాల చుట్టూ ఈ చిత్ర కథ సాగనుంది. బాంబే హైకోర్టు నేపథ్యంలో గ్రిప్పింగ్ కోర్టు రూమ్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో కాజల్ అగర్వాల్




## కోలీవుడ్‌లో దీపావళి ఫైట్

### రజనీకాంత్ జైలర్-2తో ధనుష్ మూవీ పోటీ



కోలీవుడ్‌లో ఈ ఏడాది దీపావళి పండుగకు బాక్సాఫీస్ దగ్గర మరోసారి భారీ వార్‌కు రంగం సిద్ధమవుతోంది. సూపర్ స్టార్ రజనీకాంత్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ సీక్వెల్ 'జైలర్ 2' షూటింగ్ శరవేగంగా జరుగుతున్న సంగతి తెలిసిందే. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో సన్ పిక్చర్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్ ఇప్పటికే 90 శాతం షూటింగ్ పూర్తి చేసుకుని చివరి దశకు చేరుకుంది. ఇక ఈ సినిమాకు సంబంధించిన డిజిటల్, శాటిలైట్ రైట్స్ కోసం దిగ్గజ ఓటీటీ సంస్థల మధ్య పోటీ నెలకొంది. ఈ సీక్వెల్‌లో బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ ఒక పవర్‌ఫుల్ క్యామియో రోల్‌లో సందడి చేయనున్నాడు. వచ్చే వారం నుంచి హృతిక్ పార్ట్ షూటింగ్‌ను ప్లాన్ చేశారు. అన్నీ అనుకున్నట్లు జరిగితే 'జైలర్ 2'ను దీపావళి కానుకగా ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా రిలీజ్ చేయాలని మేకర్స్ భావిస్తున్నారు. అధికారిక ప్రకటన త్వరలోనే రానుంది. ఇదిలా ఉంటే నటుడు ధనుష్ కూడా అదే దీపావళి రేసులోకి దిగేందుకు సిద్ధమవుతున్నట్లు కోలీవుడ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. ధనుష్ కెరీర్‌లో 55వ చిత్రంగా 'అమరన్' ఫేమ్ రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌పై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ఈ సినిమాలో మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి కీలక పాత్ర పోషిస్తుండగా, స్టార్ హీరోయిన్లు సాయి పల్లవి, శ్రీలీల కథానాయికలుగా నటిస్తున్నారు. పాన్ ఇండియా లెవెల్లో భారీ తారాగణంతో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని కూడా దీపావళికే రిలీజ్ చేసే యోచనలో నిర్మాతలు ఉన్నారు. ప్రస్తుతం రెండు టీమ్స్ పోస్ట్ ప్రొడక్షన్ పనులు, చివరి షెడ్యూల్ షూటింగ్స్‌తో బిజీగా ఉన్నాయి. ఒకవైపు రజనీకాంత్ క్రేజ్, మరోవైపు ధనుష్ కంటెంట్.. దీంతో ఈ దీపావళికి కోలీవుడ్ బాక్సాఫీస్ వద్ద గట్టి పోటీ ఖాయమని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు.



Printed by Published by KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH on behalf of KALIDINDI RAJA JAGADESHWARA SANTOSH, Printed at and Published at 1-7-750/1-3, F 103 and 102, ST. PIOUS SCHOOL ROAD, Sruthi Sadan Apts, Ramnagar, Hyderabad-500020, Telangana. Editor RAGHURAMA RAJU KALIDINDI. PRGI NUMBER TGTEL/25/A3603, CELL : 9849379430, MAIL ID: kingdailynewspaper@gmail.com